PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 బుధవారం 27 ఆగస్టు 2025 సంపుటి: 01, సంచిక : 79
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

### దూకుడు పెంచిన యాపిల్ కంపెనీ

ఇండియాలో యాపిల్ ఫోన్ల తయారీని నిలిపివేయాలని ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఆ కంపెనీకి ఒత్తిడి వస్తున్నా.. యాపిల్ కంపెనీ మాత్రం భారత్‌లో తన కార్యకలాపాలను మరింత దూకుడుగా విస్తరిస్తోంది. తాజాగా మన దేశంలో నాలుగో స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు యాపిల్ కంపెనీ తెలిపింది. భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్న యాపిల్ నాలుగో యాపిల్ స్టోర్‌ను ఏర్పాటుచేయనున్నట్లు మంగళవారం ప్రకటించింది. మహారాష్ట్రలోని పుణెకు చెందిన కొరెగావ్ పార్క్‌లో సెప్టెంబర్ 4న దీనిని ప్రారంభించనుంది. అలాగే స్టోర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్‌ను కూడా విడుదల చేసింది. బెంగళూరులోని స్టోర్ మాదిరిగానే పుణెలోని స్టోర్‌ను కూడా నెమలి కళాకృతితో తీర్చిదిద్దారు.




# ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు!



## సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాల ప్రచురణ

- ఎన్నికలకు సన్నద్ధం కావడంలో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల
- డీపీవోలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశాలు
- ఎస్ఈసీ నోటిఫికేషన్ జారీ

**సూర్య హైదరాబాద్**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి... రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) సన్నాహాలు వేగవంతం చేసింది. ఎన్నికలకు సన్నద్ధం కావడంలో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందుకు అనుగుణంగా జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారులను (డీపీవో) ఆదేశిస్తూ మంగళవారం - మిగతా2లో



- వాయిదా వేద్దామా లేక బీసీలకు 42% కోటాపై జీవో ఇచ్చి
- ముందుకెళ్దామా అన్న దానిపై కాంగ్రెస్ మల్లగుల్లాలు
- వాయిదా వేయాలనుకుంటే ఆర్డినెన్స్‌ను మళ్లీ పంపాలని సలహా ఇచ్చిన న్యాయ నిపుణులు
- హైకోర్టు గడువు ముంచుకొస్తున్నా ఎటూ తేల్చుకోలేని పరిస్థితి
- పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి వెళితే బూమరాంగ్ అవుతుందనే ఆందోళన
- 42% రిజర్వేషన్లతో జీవో ఇవ్వడమే ప్రత్యామ్నాయమనే ప్రతిపాదన తెరపైకి

**సూర్య హైదరాబాద్**

రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికల విషయంలో డైలమా ఏర్పడింది. వాయిదా వేద్దామా? ప్రభుత్వ పరంగా బీసీలకు 42% కోటాపై జీవో ఇచ్చి ముందుకు వెళదామా అన్న దానిపై అధికార కాంగ్రెస్ పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. ఈ అంశంపై జాతీయ స్థాయి న్యాయ నిపుణులతో పాటు పార్టీ హైకమాండ్‌తో కూడా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం చర్చలు జరిపినప్పటికీ ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీసీసీ నియమించిన మంత్రుల బృందం ఇచ్చే నివేదిక కీలకం కానుంది. మంత్రుల బృందం చేసే సిఫారసును ఈ నెల 30వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ



## ఇక మనమే గ్లోబల్ హబ్

- క్లీన్ ఎనర్జీలో భారత్ సరికొత్త శకం..
- అహ్మదాబాద్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తికి శ్రీకారం
- 100 దేశాలకు 'మేడ్ ఇన్ ఇండియా' ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులు ప్రారంభం
- క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీలో భారత్ ప్రపంచ హబ్‌గా మారుతుందన్న ప్రధాని
- భారత్‌లో బ్యాటరీల తయారీ కోసం మూడు జపాన్ కంపెనీల భాగస్వామ్యం
- పెట్టుబడుల కోసం రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని మోదీ పిలుపు
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాలపై ఇకపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్న ప్రధాని

3

## 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం
- కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికపై సభలో చర్చించే అవకాశం

**సూర్య హైదరాబాద్**

ఈ నెల 30 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. శాసనసభతో పాటు మండలి సమావేశాలు సైతం జరగనుండగా, ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికపై సభలో చర్చించే అవకాశం ఉంది. కాగా అదేరోజు రాష్ట్ర మంత్రివర్గం కూడా సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటి గంటకు - మిగతా2లో



**నేడు వినాయక చవితి సందర్భంగా పత్రిక కార్యాలయానికి సెలవు. కావున రేపు (గురువారం) పత్రిక వెలువడదు. పునర్దర్శనం శుక్రవారం.**

## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు



- పాకిస్థాన్‌కు సీడీఎస్ పరోక్ష హెచ్చరిక
- ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేసిన సీడీఎస్
- శాంతిని కోరుకోవడాన్ని బలహీనతగా చూడొద్దని పరోక్ష హెచ్చరిక
- శక్తి లేని శాంతి కేవలం ఒక ఊహ మాత్రమేనని వ్యాఖ్య
- భవిష్యత్ యుద్ధాల స్వరూపాన్ని నిర్దేశించే నాలుగు కీలక అంశాల ప్రస్తావన
- వికసిత భారత్ కోసం ఆత్మనిర్భరత అవసరమని ఉద్ఘాటన
- ఆర్మీ వార్ కాలేజీలో 'రణ్ సంవాద్' సదస్సులో ప్రసంగం

3






## ఇతర పార్టీలూ మద్దతిస్తున్నాయి

- ఉపరాష్ట్రపతి.. రాజకీయ పదవి కాదు
- రెండో అత్యున్నత రాజ్యాంగబద్ధ పదవి
- ఇండీ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

## క్రమబద్ధీకరణకు అడ్డంకి

- హైకోర్టు తీర్పు మేరకు సాదాబైనామాల క్రమబద్ధికరణకు సమయం పట్టే అవకాశం
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఆర్డీవోల ద్వారా నోటీసులు
- క్రమబద్ధికరణ జరగాలంటే స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సిందే
- రాష్ట్రంలో ఇప్పటివరకు 13 సార్లు సాదాబైనామాల క్రమబద్ధీకరణ
- ఇంకోసారి అవకాశం లేకుండా భూభారతి చట్టంలో నిబంధన



**సూర్య హైదరాబాద్**

సాదాబైనామాల క్రమబద్ధికరణ విషయంలో హైకోర్టులో ఉన్న అడ్డంకి తొలగిపోవడంతో రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ఊరట లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 9.26 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, దాదాపు 10 లక్షల ఎకరాల భూమి ఈ దరఖాస్తుల పరిధిలో ఉంటుందని, ఈ మేరకు ఆ భూములన్నింటికీ త్వరలోనే విముక్తి లభిస్తుందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. అయితే, ఈ ప్రక్రియ పూర్తయ్యే సరికి అటూఇటుగా ఆరునెలల సమయం పట్టే అవకాశముంది. భూభారతి పేరుతో రాష్ట్రంలో అమల్లో ఉన్న ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం ఈ దరఖాస్తులను పరిష్కరించాల్సి ఉంటుంది. రెవెన్యూ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రక్రియ ఎలా ఉంటుందంటే...! హైకోర్టు తీర్పునకు అనుగుణంగా సాదాబైనామాల ద్వారా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల - మిగతా2లో

# ఎన్నికల నిర్వహణకే ప్రభుత్వం మొగ్గు!

-మొదటిపేజీ తరువాయి

చర్చించిన తర్వాతే దీనిపై ఓ స్పష్టత వస్తుందని ప్రభుత్వ, కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పంచాయతీ ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశం ఎంతకీ తేలకపోవడం ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి సమస్యగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మెజారిటీ మంత్రులు ఎన్నికలకు వెళ్లాం అనే ఆలోచనలో ఉన్నారు. కానీ పార్టీలోని బీసీ నాయకత్వం రిజర్వేషన్ల కల్పనపై మాట నిలబెట్టుకుని ఎన్నికలకు వెళ్తే బాగుంటుందని సూచిస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొదటి నుంచి 42% రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలనే ఆలోచనతో ఉన్నారు. ఈ తర్జనభర్జనల నేపథ్యంలోనే న్యాయనిపుణుల సలహాలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయించింది. అందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పీసీసీ నియమించిన ఐదుగురు మంత్రుల బృందం ఢిల్లీలో పర్యటించి న్యాయ నిపుణులతో పాటు పార్టీ హైకమాండ్‌తో కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు తెలుస్తోంది.

**పార్టీ పరంగా ఇస్తే బూమరాంగ్ ఖాయం**

విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం..కులగణన చేస్తామని, ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రజలకు వాగ్దానం చేసి, ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని చెబితే బూమరాంగ్ కావడం ఖాయమని కాంగ్రెస్ హైకమాండ్ తేల్చిచెప్పింది. అవసరమైతే ఎన్నికల నిర్వహణకు కోర్టును మరింత సమయం కోరాలని సూచించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి పంపిన రెండు బిల్లులతో పాటు, 50% రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌పై కేంద్ర ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడాన్ని తప్పుపడుతూ.. క్షేత్రస్థాయిలో బీజేపీని ఎండగట్టే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పినట్లు తెలిసింది. సోమవారం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీలతో చర్చలు జరిపిన సీఎం, మంత్రుల బృందం.. మంగళవారం బిహార్‌లో ఓటర్ అధికార యాత్ర నిర్వహిస్తున్న రాహుల్‌గాంధీతోనూ సమాలోచనలు జరిపినట్లు తెలిసింది.

**బీజేపీని ఎండగట్టాల్సిందే..**

'పార్టీ పరంగా సాధ్యం కాదు. ఒకవేళ ఇచ్చినా మళ్లీ గత అసెంబ్లీ ఎన్నికల నాటి పరిస్థితే రావొచ్చు. ఓడిపోయే సీట్లను బీసీలకు కేటాయించొచ్చు. ఇది బీసీలను మోసం చేయడమే..' అని కుండబద్ధలు కొట్టినట్లు సమాచారం. 'బీసీలకు రిజర్వేషన్ల అమలు ఇప్పుడు ఒక్క తెలంగాణ అంశమే కాదు.. యావత్ దేశానిది. రిజర్వేషన్లు అమలు చేయకుండా ఒకట్రెండు ధర్నాలు చేసి చేతులు ముడుచుకుంటే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి బీజేపీని మరింతగా ఎండగట్టాలి. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి..' అని హైకమాండ్ పెద్దలు గట్టిగా చెప్పినట్లు తెలిసింది.ఈ పరిస్థితుల్లోనే ప్రభుత్వ పరంగా బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే అంశం తెరపైకి వచ్చింది. అయితే ఇది కోర్టులో నిలబడుతుందా లేదా? అనే సందేహం కూడా కాంగ్రెస్ నేతలను వెంటాడుతోంది.

**కోర్టును గడువు అడగండి..మళ్లీ ఆర్డినెన్స్ పంపండి**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ విషయంలో న్యాయ కోవిదుల అభిప్రాయాలను తీసుకుని నివేదిక సమర్పించేందుకు గాను టీపీసీసీ నియమించిన మంత్రుల బృందం ఆదివారం ప్రజాభవన్‌లో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డితో సమావేశమై ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలు, న్యాయపరంగా ఉన్న ఇబ్బందులపై చర్చించింది. తాజాగా సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీ, ప్రముఖ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో సమావేశమైంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఆలోచనలను కూడా వివరించింది. ఈ నేపథ్యంలో 42 శాతం రిజర్వేషన్లను అధికారికంగా అమలు చేయాలనే కోణంలోనే ముందుకు వెళ్లాలనుకుంటే ఎన్నికలను మూడు నెలల పాటు వాయిదా వేయాలని సూచించినట్టు తెలిసింది. అదే విధంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ తెచ్చిన ఆర్డినెన్స్ కాలపరిమితి 3 నెలలు ముగిసిన తర్వాత మళ్లీ ఆర్డినెన్స్ చేసి, మరోమారు ఆమోదం కోసం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపాలని చెప్పినట్లు సమాచారం. ఈలోపు హైకోర్టులో ఉన్న కేసులో ఆరు వారాల గడువు కోరుతూ కౌంటర్ దాఖలు చేయాలని, తద్వారా సుప్రీంకోర్టులో ఉన్న కేసుకు బలం చేకూరుతుందని, రెండోసారి మంత్రివర్గం పంపిన ఆర్డినెన్స్‌ను రాజ్యాంగ పదవుల్లో ఉన్న వారు ఆమోదించాల్సి ఉంటుందని ఆయన వివరించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

**అసెంబ్లీ సమావేశాల నిర్ణయంపై చర్చ**

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశం అవుతోంది. అసెంబ్లీ నిర్వహణకు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధం లేనప్పటికీ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండటం సాధ్యం కాదనే కోణంలోనే వీలున్నంత త్వరగా అసెంబ్లీ సమావేశాలను పూర్తి చేయాలన్న యోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు.

ఇదే నిజమైతే 30వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ జీవో విడుదల చేయాలని మంత్రివర్గం నిర్ణయిస్తుందని తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల వాయిదాకు కనుక మొగ్గు చూపితే హైకోర్టును గడువు అడిగే విధంగా కేబినెట్ నిర్ణయం ఉంటుందని సమాచారం ఏది ఏమైనా ఈ నెల 30వ తేదీన జరిగే రాష్ట్ర మంత్రివర్గ భేటీలో..అన్ని అంశాలను క్రోడీకరించి మంత్రుల బృందం ఇచ్చే సిఫారసుపై చర్చించిన అనంతరమే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయా? వాయిదా పడతాయా? అన్నదానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

**రాహుల్ యాత్రలో సీఎం, రాష్ట్ర నేతలు**

కేంద్ర ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ బిహార్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్‌తో కలిసి రేవంత్‌రెడ్డి రోడ్‌షోలో పాల్గొన్నారు. రోడ్‌షోకు హాజరైన పార్టీ నేత ప్రియాంకగాంధీని కూడా రాష్ట్ర నేతలు కలిశారు

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

-మొదటిపేజీ తరువాయి

కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంలో ఎదురవుతున్న ఆటంకాలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

**బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై ప్రత్యేక దృష్టి**

ఒకవైపు సెప్టెంబర్ 30 లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మరో ప్రయత్నంగా ఆర్డినెన్స్‌లను రూపొందించి పంపగా వాటిని సైతం గవర్నర్ రాష్ట్రపతికి సిఫారసు చేయడంతో ప్రభుత్వం తీవ్ర ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల తదితర అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది.


**కాళేశ్వరం కమిషన్ నివేదిక, యూరియా కొరత తదితరాలపై..**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని భావిస్తున్న నేపథ్యంలో.. దీనిపై సైతం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అలాగే రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను కూడా మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

# మరణం అంచున పునరుజ్జీవం!

హైదరాబాద్

ఒక కణం చనిపోవడం ప్రారంభించిన తరువాత ఆ ప్రయాణాన్ని రివర్స్ చేయడం అసాధ్యం అనే నమ్మకాన్ని వమ్ము చేసే విషయం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రజ్ఞుల పరిశోధనలో వెల్లడైంది. మరణం అంచున్న ఉన్నా కూడా తమంతతామే పునరుజ్జీవం పొందే అంతర్గత విధానం కణాల్లో ఉంటుందని సీసీఎంబీకి చెందిన డాక్టర్ సంతోష్ చౌహాన్ నేతృత్వంలోని శాస్త్రవేత్తల బృందం గుర్తించింది. ఈ ప్రక్రియ కణాల పెరుగుదలను అనుకరిస్తుందని వారు పేర్కొన్నారు. కణాల్లో జరిగే ఈ ప్రక్రియను వారు 'ప్రోగ్రామ్డ్ సెల్ రివైవల్'గా అభివర్ణించారు. ఈ ప్రక్రియ పలు జీవుల్లో కణజాలాల మరమ్మతు, పునరుద్ధరణను వేగవంతం చేస్తుందని వారు పేర్కొన్నారు. కణాలు అలా పునరుజ్జీవం పొందడం యాదృచ్ఛికంగా జరిగే ప్రక్రియ కాదని.. చనిపోయే కణాలు తమనుతాము పునరుజ్జీవింపజేసుకోవడానికి అవసరమైన అన్ని




ముఖ్యమైన ప్రక్రియలనూ (అభివృద్ధి, జీవక్రియ, రోగనిరోధక శక్తి మార్గాలను) రీబూట్ చేసుకుంటాయని డాక్టర్ చౌహాన్ వెల్లడించారు. ఎలుకల్లో చర్మంపై గాయాలు, కాలినగాయాలు వేగంగా నయం కావడానికి.. చిరుకప్పల్లో తోక పునరుత్పత్తిని ఉత్తేజితం చేయడానికి, సీ-ఎలిగాన్స్‌లో నాడుల మరమ్మతులను ప్రోత్సహించడంలో.. ఫ్రూట్‌ఫ్లైసలో రక్త మూలకణాల ఉత్పత్తిని పెంచడంలో ఈ ప్రోగ్రామ్డ్ సెల్ రివైవల్ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతోందని డాక్టర్ చౌహాన్ పేర్కొన్నారు. ఈ రెస్క్యూ మెకానిజం అన్ని జీవుల కణాల్లోనూ అంతర్గతంగా ఉంటుందని.. గాయాలు నయం చేయడానికి, దెబ్బతిన్న కణజాలాలకు మరమ్మతు చేయడానికి దీన్ని ఉపయోగించవచ్చుని ఆయన వివరించారు. అదే సమయంలో.. ఈ మెకానిజం క్యాన్సర్ చికిత్సలను మరింత క్లిష్టతరం చేస్తుందని కూడా పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. సాధారణంగా క్యాన్సర్ చికిత్సల ప్రధాన లక్ష్యం క్యాన్సర్ కణాలను చంపడమే. కానీ, ఆ కణాలు ఈ మెకానిజంతో బతికితే క్యాన్సర్ కణితులు చికిత్సకు స్పందించకుండా పోయే ప్రమాదం ఉందని డాక్టర్ చౌహాన్ ఆందోళన వ్యక్తం చేశారు. గాయాలను నయం చేయడానికి, డీజనరేటివ్ డిసీజ్‌లను నయం చేయడానికి, అవయవాల పునరుత్పత్తికి సంబంధించి కొత్త చికిత్సలను అభివృద్ధి చేయడానికి తాము గుర్తించిన ఈ అంశాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

# 'క్లినిక్'లతో లక్షలాది ఆర్మీ కుటుంబాలకు లబ్ధి

హైదరాబాద్

ఉచిత న్యాయ సేవల క్లినిక్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది ఆర్మీ కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ పాట్రన్ ఇన్ చీఫ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ అన్నారు. సైనికులపట్ల న్యాయవ్యవస్థకు ఉన్న నిబద్ధతకు ఈ క్లినిక్‌లు నిదర్శనమని చెప్పారు. వీర పరివార్ సహాయత యోజన%-%2025 కింద దేశవ్యాప్తంగా ఉచిత న్యాయ సేవల క్లినిక్‌ల ద్వారా సేవలు అందించాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హైకోర్టు ఆవరణలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆన్‌లైన్ ద్వారా 8 జిల్లాల్లో క్లినిక్‌లను టీఎస్‌ఎల్‌ఎస్‌ఏ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.శామ్ కోషితో కలసి సీజే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సాయుధ దళాల సభ్యులు, వారి కుటుంబాలకు న్యాయ సాయం అందించడంలో ఇదో కీలక ముందడుగు అన్నారు. గతంలో ఏర్పాటు చేసిన రెండు క్లినిక్‌లతో కలిపి ఉమ్మడి జిల్లాలవారీగా కేంద్రాలు ఏర్పాటయ్యాయని.. మిగిలిన జిల్లాలకు కూడా క్లినిక్‌లను విస్తరిస్తామని చెప్పారు. న్యాయ సాయంతోపాటు న్యాయ సూచనలు కూడా ఈ క్లినిక్‌లలో అందిస్తామని వివరించారు. గత నెల 26న రెండు క్లినిక్‌లు ప్రారంభమవగా తాజాగా మరో 8 క్లినిక్‌లు ఏర్పాటు కావడం అథారిటీ చొరవకు నిదర్శనమని కొనియాడారు. అనంతరం జస్టిస్ శామ్ కోషి మాట్లాడుతూ రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబాలకు సమగ్ర న్యాయ సాయం అందించడమే క్లినిక్‌ల లక్ష్యమన్నారు. ఆస్తి, కుటుంబ వివాదాలు, పింఛన్, సంక్షేమ పథకాలు పొందడంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంలో క్లినిక్‌లు కీలకపాత్ర పోషిస్తాయని చెప్పారు. ప్రతి మొదటి, నాలుగో శనివారం ఈ క్లినిక్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సందర్భంగా తెలుగులోకి అనువదించిన నల్సా థీమ్ సాంగ్ 'ఏక్ ముట్ఠీ ఆస్మాన్'ను న్యాయమూర్తులు విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ గోవర్ధన్‌రెడ్డి, అథారిటీ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరీ నేరుగా హాజరుకాగా జిల్లా ప్రిన్సిపల్ జడ్జీలు, ప్రాంతీయ సైనిక్ వెల్ఫేర్ బోర్డుల అధికారులు, మాజీ సైనికులు, సైనిక్ వెల్ఫేర్ కార్యాలయ సిబ్బంది ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు.

## అటూ ఇటుగా.. ఆరు నెలలు క్రమబద్ధీకరణకు అడ్డంకి

-మొదటిపేజీ తరువాయి

పరిష్కారానికి తొలుత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలి. ఈ నోటిఫికేషన్ మేరకు పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల దరఖాస్తుదారులకు, సాదాబైనామాల ద్వారా ఆ భూమిని అమ్మిన వారికి ఆర్డీవో నోటీసులు జారీ చేస్తారు. ఈ నోటీసుల జారీకి కనీసం నెలరోజుల సమయం పడుతుందని అంచనా.

ఈ నోటీసుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తారు. ఆ భూమికి సంబంధించి తెల్ల కాగితంపై రాసుకున్న సాదాబైనామా లావాదేవీ సరైందా లేదా అన్నది పరిశీలించడంతోపాటు చుట్టుపక్కల ఉన్న రైతుల అభిప్రాయాలు కూడా తీసుకుంటారు.

అప్పుడు సదరు భూమిని అమ్మింది, కొన్నది వాస్తవమే అని తేలితే ప్రత్యేక ఆర్డర్ ఇచ్చి రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ కట్టి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తారు.

అలా స్టాంపు డ్యూటీ కట్టిన తర్వాత ఓ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ సర్టిఫికెట్‌ను రిజిస్టర్డ్ డాక్యుమెంట్ కింద పరిగణనలోకి తీసుకుంటారు.

దీని ఆధారంగా ఆ భూమికి పాసు పుస్తకాలు వస్తాయి. ఈ సర్టిఫికెట్ ద్వారానే క్రయవిక్రయ లావాదేవీలు జరుగుతాయి.

గతంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ ఉచితంగా చేసేవారు. కానీ, భూభారతి చట్టంలో మార్చిన నిబంధన ప్రకారం స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాలి.

హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు 2020లో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మాత్రమే క్రమబద్ధీకరిస్తారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు 13సార్లు సాదాబైనామాలను క్రమబద్ధీకరించారు. 2020లో 14వ సారి జారీ చేసిన సాదాబైనామా ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు ఆ ప్రక్రియకు మోక్షం కలగనుంది. దీని తర్వాత సాదాబైనామాల క్రమబద్ధీకరణకు ఆస్కారం ఉండదు. ఈ మేరకు భూభారతి చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. 2020లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించిన తర్వాత మళ్లీ సాదాబైనామాల దరఖాస్తులను తీసుకునే వీల్లేదని పేర్కొన్నారు. మళ్లీ సాదాబైనామాల క్రమబద్ధీకరణ చేపట్టాలనుకుంటే ఆ చట్టాన్ని సవరిస్తే కానీ సాధ్యం కాదు.

## సెప్టెంబర్ 2న ఓటర్ల తుది జాబితాల ప్రచురణ



-మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణీకుముదిని నోటిఫికేషన్ జారీచేశారు. 2025 జూలై 1న అందుబాటులోకి వచ్చిన అసెంబ్లీ నియోజకవర్గాల ఫొటోలతో కూడిన ఓటర్ల జాబితాలను తు.చ. తప్పకుండా అనుసరిస్తూ వార్డుల విభజన చేస్తూ తామిచ్చిన షెడ్యూల్‌ను అనుసరించాలని స్పష్టం చేశారు. డీపీవోలతో పాటు అదనపు జిల్లా ఎన్నికల అధికారులు, ఎంపీడీవోలు, సహాయ జిల్లా ఎన్నికల అధికారులు, సీఈవోలు, అదనపు జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లకు (హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలు మినహా), పీఆర్ ఆర్‌డీ డైరెక్టర్, పంచాయతీరాజ్‌శాఖ ముఖ్యకార్యదర్శికి దీని ప్రతులను పంపించారు.

**ఎస్ఈసీ జారీచేసిన షెడ్యూల్...**

గురువారం (ఆగస్ట్ 28న) గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి గ్రామపంచాయతీలు, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలి.

శుక్రవారం (29న) జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారుల (జిల్లా కలెక్టర్లు) సమావేశం

శనివారం (30న) మండల స్థాయిలో సంబంధిత ఎంపీడీవోల ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం గురువారం నుంచి శనివారం దాకా (28 నుంచి 30వ తేదీ వరకు) గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్ల రీఅరేంజ్‌మెంట్‌కు (వార్డుల వారీగా గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా) సంబంధించి అభ్యంతరాల స్వీకరణ

? ఆదివారం (31న) ఈ అభ్యంతరాలపై డీపీవోల ద్వారా పరిష్కారం

? సెప్టెంబర్ 2న గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాలను డీపీవోల ద్వారా ప్రచురణ.

## త్వరలో నేతన్నలకు 33 కోట్ల రుణమాఫీ



సిరిసిల్ల

రైతులకు రుణమాఫీ చేసినట్లే నేత కార్మికుల రుణాలను క్యాబినెట్‌లో చర్చించి త్వరలోనే మాఫీ చేస్తామని చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ముఖ్యమంత్రి నేతన్నలకు సంబంధించి రుణమాఫీ చేయడానికి నివేదిక తయారు చేయాలని సూచించిన మేరకు రూ.33 కోట్లు రుణాలు ఉన్నట్లు లెక్కలు తేలాయని తెలిపారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్న పొదుపు(త్రిఫ్ట్), నేతన్న బీమా పథకాల చెక్కులను పంపిణీ చేశారు. ఇదే సందర్భంలో దసరాకు స్వశక్తి మహిళలకు అందించే ఏకరూప చీరలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జౌళి శాఖ కార్యదర్శి శైలజారామయ్యర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. మహిళలు గౌరవంగా స్వీకరించేలా నాణ్యమైన చీరలు అందిస్తామన్నారు. ఒక్క చీరపై రూ.480 ఖర్చు చేస్తూ 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలో గతంలో ఏం జరిగిందో.. ఇప్పుడు ఏం జరుగుతుందో గమనించాలన్నారు.

# ఇక మనమే గ్లోబల్ హబ్

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) తయారీ, ఎగుమతుల రంగంలో భారత్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఇకపై 'మేడ్ ఇన్ ఇండియా' ఈవీలు ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. అహ్మదాబాద్‌లోని హన్సల్‌పూర్‌లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఎగుమతులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల స్థానిక ఉత్పత్తిని కూడా ఆయన ప్రారంభించడం విశేషం.
ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, క్లీన్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ రంగాల్లో భారత్ ప్రపంచ హబ్‌గా అవతరించబోతోందని ధీమా వ్యక్తం చేశారు. "గతంలో ఈవీలకు అత్యంత కీలకమైన బ్యాటరీలను మనం పూర్తిగా దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారుతోంది. మూడు ప్రముఖ జపాన్ కంపెనీలు కలిసి భారత్‌లోనే బ్యాటరీ సెల్స్, ఎలక్ట్రోడ్‌లను తయారు చేస్తున్నాయి. ఇది మన దేశ హైబ్రిడ్ వాహనాల మార్కెట్‌కు కొత్త ఊపునిస్తుంది"



అని ఆయన వివరించారు. భారత్-జపాన్ మధ్య బంధం కేవలం వ్యాపారానికే పరిమితం కాదని, చారిత్రక, సాంస్కృతిక మూలాలున్నాయని ప్రధాని గుర్తుచేశారు. "సుజుకి వంటి జపాన్ కంపెనీలు ఇక్కడ కార్లను తయారు చేసి, తిరిగి జపాన్‌కే ఎగుమతి చేస్తున్నాయి. ఇదే మన రెండు దేశాల సంబంధాల బలానికి నిదర్శనం. మారుతి సుజుకితో మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు బుల్లెట్ ట్రైన్ వేగంతో దూసుకెళుతోంది" అని మోదీ వ్యాఖ్యానించారు. గత దశాబ్దంలో తమ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు, 'మేక్ ఇన్ ఇండియా' వంటి కార్యక్రమాల ఫలాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. "వ్యాపార అనుకూల వాతావరణం, లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో పెట్టుబడులకు అనువైన మార్గాలను సృష్టించాం. ఫలితంగా పదేళ్లలో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ 500 శాతం పెరిగింది" అని అన్నారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, "మేం ఇక్కడితో ఆగిపోం. ఇకపై సెమీకండక్టర్ల తయారీపై దృష్టి పెడతాం. త్వరలో ఆరు ప్లాంట్లు సిద్ధం కాబోతున్నాయి. అదేవిధంగా కీలక ఖనిజాల కోసం 'నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్'ను ప్రారంభించాం" అని ప్రధాని వెల్లడించారు. అభివృద్ధి అనుకూల విధానాల రూపకల్పనలో రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడాలని, పెట్టుబడిదారుల విశ్వాసాన్ని చూరగొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# కొత్త చట్టం అధికారపార్టీకి చుట్టమైతే?

నాగుపామును ఆడించే మంత్రగాడు అదే పాము కాటుకు గురయ్యాడని సామెత. మన రాజకీయ నేతలు చేసే కొన్ని విన్యాసాలు భవిష్యత్తులో వారికే తలనొప్పిగా మారతాయన్నది వారు విస్మరిస్తుంటారు. తాజాగా కేంద్రం తీసుకు వస్తున్న చట్టం కూడా అదే తరహాలో ఉందా అనిపిస్తోంది. వినడానికి మాత్రం ఇది బాగుందే అనిపించవచ్చు. కాని పరిశీలిస్తే ఇందులో ఏదో మతలబు ఉందన్న సంగతి అర్థమవుతుంది.
ప్రధాని లేదా ముఖ్యమంత్రి, లేదా మంత్రులు ఎవరైనా ముప్పై రోజులు జైలులో ఉండవలసి వస్తే వారి పదవి ఆటోమాటిక్‌గా పోయే విధంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం  చట్టం తీసుకువస్తోంది. ఈ చట్టాన్ని సడన్‌గా ఎందుకు తీసుకు వస్తున్నారన్న దానిపై రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి. బీజేపీయేతర పక్షాలు ముఖ్యమంత్రులు, మంత్రులను పదవి నుంచి తప్పించి ప్రభుత్వాలను అస్థిర పరచడానికి ఇది ఒక ఆయుధం అవుతుందన్న సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు. తమ మిత్రపక్షాలలో ఎవరైనా తోక ఝాడిస్తున్నారన్న అనుమానం వచ్చినా వారిపై కూడా ఈ అస్త్రం ప్రయోగించవచ్చన్న అభిప్రాయాన్ని విపక్షాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రత్యేకించి కేంద్రంలో  పూర్తి మెజార్టీ లేని నేపథ్యంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీహారు ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌లను కట్టడి చేయడానికి కూడా దీన్ని వాడవచ్చని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఈ బిల్లుపై టీడీపీ, జేడీ(యూ)లు కూడా మథన పడుతున్నట్లుగా కనిపిస్తుంది. ఈ చట్టాన్ని కేంద్రం చిత్తశుద్ధితోనే చేస్తుంటే ఎవరికి అభ్యంతరం ఉండదు. కాని మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇటీవలికాలంలో పెడధోరణులు ప్రబలిపోయాయి. తమ ప్రత్యర్థులను ఎలాగైనా అణచివేయాలని, తద్వారా శాశ్వతంగా తామే అధికారంలో ఉండాలన్న తాపత్రాయం మన నాయకులలో అధికంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్య యుతంగా ఎంతకాలం పాలనలో ఉన్నా ఫర్వాలేదు. అలా కాకుండా నియంతృత్వ ధోరణిలో వ్యవహరిస్తుండడమే ఇబ్బందిగా మారుతోంది. గతంలో యూపీఏ ప్రభుత్వ హయాంలో న్యాయస్థానం ఒక తీర్పు ఇచ్చింది. ఎవరైనా ప్రజాప్రతినిధి రెండేళ్లు జైలు శిక్షకు గురైతే వెంటనే అతను పదవికి అనర్హుడవుతాయన్నది దాని సారాంశం. దానివల్ల అనర్థాలు రావచ్చని తలంచిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఆ తీర్పును రివర్స్ చేస్తూ ఒక ఆర్డినెన్స్ తీసుకు వచ్చింది. కానీ అప్పట్లో రాహుల్ గాంధీ అవగాహనా రాహిత్యంతో ఆ ఆర్డినెన్స్ కాపీని బహిరంగంగానే చించివేశారు. ఒక రకంగా ఇది తన ప్రభుత్వాన్ని తానే అవమానించుకున్నట్లు కాదా! పైగా ఆనాటి ప్రదాని మన్మోహన్ సింగ్ పై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. అలాంటి వ్యక్తి నేతృత్వంలో వచ్చిన ఆ ఆర్డినెన్స్ పూర్వాపరాలు ఆలోచించకుండా అనుచితంగా ప్రవర్తించడంతో ఆ తీర్పు అమలులోనే ఉంది. దాని ఫలితంగా కొందరు తమ పదవులు కోల్పోయారు. ఉదాహరణకు లాలూ ప్రసాద్ యాదవ్‌కు శిక్ష పడడంతో రాజ్యసభ సభ పదవి పోయింది. ఆ తర్వాత కాలంలో రాహుల్ గాంధీనే ఒక కేసులో రెండేళ్లకు పైగా శిక్షకు గురి కావడం, ఆ తర్వాత ఆయన లోక్‌సభ సభ్యత్వం రద్దు కావడం జరిగిపోయింది. తదుపరి ఆయన సుప్రీంకోర్టుకు వెళ్లి పునరుద్దరించుకోగలిగారు. అది వేరే సంగతి. రాహుల్ ఈ ఉదంతంలో  తాను చేసిన తప్పుకు తానే బలైనట్లే కదా! ఇప్పుడు బీజేపీ కూడా అదే తరహా ప్రయోగం చేస్తోందా? ఒకవేళ వేరే ప్రభుత్వం కేంద్రంలో వస్తే ,అప్పుడు ఇదే చట్టం బీజేపీ ప్రభుత్వాల మెడకు కూడా చుట్టుకునే అవకాశం ఉంటుంది. ఎందుకంటే ఎవరు అధికారంలో ఉంటే వారు సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నది వాస్తవం. ప్రధాని నరేంద్ర మోడీ ఒక సభలో మాట్లాడుతూ నేరగాళ్లు జైలు నుంచి పరిపాలించాలా? అని ప్రశ్నించారు. కొంతకాలం క్రితం ఢిల్లీలో లిక్కర్ స్కామ్ అంటూ హడావుడి చేసి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను, కొందరు మంత్రులను అరెస్టు చేశారు. డిల్లీలో పోలీస్ వ్యవస్థ కేంద్రం చేతిలోనే ఉంటుందన్న సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేయకుండా జైలులో ఉంటూనే ప్రభుత్వ విషయాలపై ఆదేశాలు ఇస్తుండేవారు. అలాగే తమిళనాడుకు చెందిన ఒక మంత్రిని ఈడి అరెస్టు చేసింది. ఆయన  కూడా పదవికి రాజీనామా చేయకుండా కేబినెట్‌లో కొనసాగారు. ఈ రెండు రాష్ట్రాలు బీజేపీకి అనుకూలంగా లేనివి. ఢిల్లీలో ఎన్నికలకు ముందు ఎలాగైనా ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించాలన్న లక్ష్యంతో బీజేపీ నాయకత్వం లిక్కర్ స్కామ్ పేరుతో కేజ్రీవాల్ ను జైలులో పెట్టిందని అప్పట్లో ప్రతిపక్షం తీవ్రంగా విమర్శించేది. ఇలా కొద్దిమందిని దృష్టిలో ఉంచుకుని ఈ చట్టం తెస్తుండడం కరెక్టేనా అన్న చర్చ ఉంది. నిజంగానే మోడీకి అవినీతి వ్యవహారాలపై చిత్తశుద్ధి ఉంటే ఏపీలో టీడీపీతో పొత్తు ఎలా పెట్టుకున్నారన్న  ప్రశ్న వస్తుంది. ఎందుకంటే మోడీని అవినీతిపరుడని, టెర్రరిస్టు అని.. ఇంకా చాలాచాలా మాటలు టీడీపీ అధినేత, 2019 ఎన్నికలకు ముందు కూడా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు విమర్శించేవారు. మోడీ స్వయంగా ఏపీలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబుపై పలు అవినీతి ఆరోపణలు చేశారు.  పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నిధులు ఇస్తుంటే చంద్రబాబు దానిని తనకు ఏటీఎం గా మార్చుకున్నారని ఆరోపించారు. ఎన్నికలలో చంద్రబాబు ఓటమి తర్వాత ఆయన పీఎస్ ఇంటిలో ఆదాయపన్ను శాఖ అధికారులు సోదాలు జరపగా  వివిధ కాంట్రాక్టు వ్యవహారాలలో రెండువేల కోట్ల అక్రమాలు జరిగాయని తేలినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అదే కాదు. స్కిల్ స్కామ్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అవినీతికి పాల్పడ్డారని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసింది. అప్పటికే కేంద్రానికి చెందిన ఈడీ అదే కేసులో పలువురిని అరెస్టు చేసింది. చంద్రబాబు వరకు కేసును ఈడీ తీసుకు రాలేదు.ఈలోగా టీడీపీతో మళ్లీ బీజేపీ జత కట్టింది. మరి ఇప్పుడు ఆ ఆరోపణలు సంగతేమిటి? అసలు ఆ కేసులలో నిజానిజాలు ఏమిటి? అన్యాయంగా చంద్రబాబు మీద  ఆ ఆరోపణలు చేశారా?లేక వాస్తవం ఉందా? అన్నది ప్రజలకు తెలియనవసరం లేదా? తన ప్రభుత్వ ఓటమి తర్వాత చంద్రబాబు ఈ పరిణామాలను ఊహించే తెలివిగా బీజేపీ పెద్దలతో రాజీ చేసుకున్నారన్నది చాలా మంది భావన. ఆ తర్వాత బతిమలాడి బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారన్నది బహిరంగ రహస్యమే.ఇలాంటివాటి గురించి మోడీ జవాబు ఇచ్చే పరిస్థితి ఉందా? ఇప్పుడు కూడా బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలను ఇరుకున పెట్టడానికి, తమ మిత్రపక్షాలైన టీడీపీ, జేడీ(యూ)లను తమ అదుపులో ఉంచుకోవడానికి ఇలాంటి చట్టం తెస్తున్నారని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ వ్యాఖ్యానించారు. దానికి తగినట్లుగానే టీడీపీ లోక్‌సభ పక్ష నేత లావు కృష్ణదేవరాయలు ఈ బిల్లును సమర్థిస్తూనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, లోపాలను సరిదిద్దాలని, జాయింట్ పార్లమెంటరీ కమిటీలో చర్చ జరుగుతుందని అన్నారు. అంటే ఈ బిల్లుపై వారు లోపల భయపడుతున్నట్లు తెలుస్తూనే ఉంది. జేడీ(యూ) నేత త్యాగి కూడా అదే తరహాలో స్పందించారు. కాంగ్రెస్ చేస్తున్న వ్యాఖ్యలలో నిజం ఉన్నా, లేకపోయినా, చంద్రబాబు విషయంలో బీజేపీ అనుసరించిన ద్వంద్వ విధానం సహజంగానే ఈ సందేహాలకు తావిస్తుంది.ఇండియా కూటమి లోనే అవినీతిపరులు ఉన్నట్లు తమ పక్షంలో ఎవరూ లేనట్లు మోడీ మాట్లాడినా జనం ఎవరూ నమ్మే పరిస్థితి లేదు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాలలో అవినీతి ఆరోపణలు వచ్చినా ఎందరిపై కేసులు పెడుతున్నారు? దేశ ప్రధాని మీద కేసు పెట్టే పరిస్థితి ఉందా? అలాగే ముఖ్యమంత్రి మీద కూడా రాష్ట్ర స్థాయిలో కేసులు పెట్టడం తేలిక కాదు. కాకపోతే న్యాయ వ్యవస్థను అడ్డు పెట్టుకుని కేంద్రం లోని అధికార పార్టీ తమ వ్యతిరేక పార్టీల  సీఎం లను ఇబ్బంది పెట్టే అవకాశం ఉండవచ్చు. మరో ఉదాహరణ చూద్దాం. దశాబ్దాల కిందట కేంద్రం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని తెచ్చింది.  అయినా దాని అమలు ఎలా ఉందో చూస్తూనే ఉన్నాం. ఇదే మోడీ ప్రభుత్వం ఇందులో ద్వంద ప్రమాణాలు పాటించడం లేదా?  సీనియర్ నేత, కేంద్ర  మాజీ మంత్రి శరద్ యాదవ్ జేడీ(యూ) పార్టీకి దూరం అయ్యారు. ఆ క్రమంలో ఆయనపై అనర్హత వేటు వేయాలని నితీష్ కుమార్ నాయకత్వంలోని జేడీ(యూ) కోరింది.దానిని ఆఘమేఘాల మీద ఆమోదించి అనర్హత వేటు వేసేశారు. తమ ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఉల్లంఘనలకు పాల్పడ్డారని, ఆయనను అనర్హుడిని చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ లోక్ సభ స్పీకర్ ను కోరింది. మొత్తం టర్మ్ పూర్తయ్యింది కాని, ఆ పిటిషన్‌ను తేల్చలేదు. ఇంకా పలు ఉదాహరణలు ఇలాంటివి ఉన్నాయి.   దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? 2014-19 మధ్యకాలంలో ఏపీలో అధికార తెలుగుదేశం పార్టీ 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలను లాక్కోవడమే కాకుండా, వారిలో నలుగురికి మంత్రి పదవులు కూడా కట్టబెట్టింది. అయినా ఆనాటి స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఒక్కరిపై కూడా చర్య తీసుకోలేదు. ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పది మంది కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ అటు శాసన వ్యవస్థలోను, ఇటు  న్యాయ వ్యవస్థలోను పోరాడుతోంది. ఇంతవరకు అదేమీ తేలలేదు. అలాగే అంతకుముందు టర్మ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పలువురు బీఆర్ఎస్‌లోకి ఫిరాయించారు. వారిపై అప్పటి స్పీకర్ చర్య తీసుకోలేదు.పైగా వారంతా బీఆర్ఎస్‌లో విలీనమైనట్లు ప్రకటించారు. కేంద్రంలోను, వివిధ రాష్ట్రాలలోను పరిస్థితులు ఇలాఉంటే ఇప్పుడు కేంద్రం తీసుకువస్తున్న ఈ కొత్త చట్టం ఎలాంటి దుష్పరిణామాలకు  దారి తీస్తుందా అన్న భయం అందరిలో ఉంది

# వరద ఉగ్రరూపం.. కొట్టుకుపోయిన హైవే

మనాలీ

హిమాచల్ ప్రదేశ్‌పై మళ్లీ ప్రకృతి తన ప్రకోపాన్ని చూపించింది. తీవ్ర స్థాయి వర్షాల వల్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వరదల వల్ల కిరాత్పూర్-మనాలీ జాతీయ హైవేపై నష్టం జరిగింది. దీంతో మండీ, మనాలీ లో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల .. బియాస్ నది ఉప్పొంగుతున్నది. దాని ఉప నదులు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో ఎమర్జెన్సీ చర్యలు చేపడుతున్నారు. జాతీయ రహదారి పలు ప్రదేశాల్లో బ్లాక్ అయ్యింది.మనాలీ సమీపంలో ఉన్న బిందు ధంక్ వద్ద బియాస్ నది వరద నీటికి జాతీయ హైవే కొట్టుకుపోయింది. దీంతో పాపులర్ టూరిస్టు కేంద్రానికి రాకపోకలు తెగిపోయాయి. మనాలీలో నది సమీపంలో ఉన్న ఓ హోటల్.. ఆ వరదలో కొట్టుకుపోయింది. మండి, కుల్లు ప్రాంతాల్లో డేంజర్ మార్క్ దాటి నది ప్రవాహిస్తున్నది. లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్న వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నది. బహంగ్, అలూ గ్రౌండ్ ప్రాంతాల నుంచి జనాలను తరలిస్తున్నారు. మరో 24 గంటల పాటు నది సమీపానికి వెళ్లవద్దు అని టూరిస్టులకు అధికారులు వార్నింగ్ ఇచ్చారు. బియాస్ నది పొంగిపొర్లుతుండటంతో మనాలిలోని ఒక బహుళ అంతస్తుల హోటల్, నాలుగు దుకాణాలు కొట్టుకుపోయాయి. మనాలి-లేహ్ హైవే పలు చోట్ల దిగ్బంధంలో చిక్కుకుంది. రోడ్ల కనెక్టివిటీ, విద్యుత్ లేకపోవడంతో వందలాది మంది ప్రజలు పలు ప్రాంతాల్లో ఎక్కడికక్కడే నిలిచిపోయారు. బహంగ్‌లోని రెండంతస్తుల భవనం వరదనీటిలో కొట్టుకుపోగా, రెండు రెస్టారెంట్లు, రెండు దుకాణాలు కుప్పకూలాయి. పలు ప్రాంతాల్లో భారీగా ఆస్తినష్టం జరిగింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. లోడింగ్‌తో ఉన్న హెవీ-డ్యూటీ ట్రక్ వరదనీటిలో కొట్టుకుపోయింది. ఇంతవరకూ వాహనం జాడ కనిపించలేదని చెబుతున్నారు. కులు-మనాలి మధ్య హైవే స్ట్రెచ్‌లు కొట్టుకుపోవడంతో లేహ్-మనాలి హైవేలో రాకపోకలను నిలిపివేశారు. బియాస్ నదిలో నీటిమట్టం ఆకస్మికంగా పెరగడంతో పత్లికుహాల్‌లోని పలు ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. ఒక ఫ్యాక్టరీలోని వస్తువులన్నీ కొట్టుకుపోయాయి.

## ఇతర పార్టీలూ మద్దతిస్తున్నాయి

లక్నో/న్యూఢిల్లీ

విపక్ష కూటమి ఇండియా తరఫున ఉపరాష్ట్రపతి పదవికి పోటీ పడుతున్న తనకు.. ఇండియాయేతర పార్టీలు కూడా మద్దతిస్తున్నాయని జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం లక్నోలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను కలుసుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి పదవి రాజకీయ పదవి కాదని, దేశంలోని రెండో అత్యున్నత రాజ్యాంగ పదవి అని.. కాబట్టి, తాను రాజకీయాలు మాట్లాడనని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్, డాక్టర్ జాకిర్‌హుస్సేన్, కేఆర్ నారాయణన్, హమీద్ అన్సారీ వంటి మేధావులు, తత్వవేత్తలు, విద్యావేత్తలు ఈ పదవిని ఇంతకుముందు అదిష్ఠించారని.. వారి నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానన్నారు.

## ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు




"ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు, అది ఇప్పటికీ కొనసాగుతోంది" అని త్రివిధ దళాధిపతి (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భారత్ శాంతినే కోరుకుంటుందని, అయితే దానిని బలహీనతగా పొరబడకూడదని ఆయన స్పష్టం చేశారు. మధ్యప్రదేశ్‌లోని మౌలో ఆర్మీ వార్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన 'రణ్ సంవాద్' సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా చేపట్టిన ఆపరేషన్ పేరును ప్రస్తావిస్తూ పాకిస్థాన్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు పంపారు. ఈ సందర్భంగా జనరల్ చౌహాన్ మాట్లాడుతూ, "భారత్ ఎల్లప్పుడూ శాంతి వైపే నిలబడుతుంది. మేము శాంతిని ప్రేమించే వాళ్ళం. అయితే దానిని ఆసరాగా చేసుకుని మమ్మల్ని దెబ్బకొట్టాలని చూస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తి లేదు" అని అన్నారు. గతంలో జరిగిన యుద్ధాలకు, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలకు వ్యత్యాసం ఉందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆయన విశ్లేషించారు. దీనిని ప్రభావితం చేసే నాలుగు ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. "రాజకీయ లక్ష్యాలను సాధించడానికి చిన్నపాటి యుద్ధాలను ఉపయోగించే ధోరణి దేశాల మధ్య పెరిగింది. యుద్ధం, శాంతి మధ్య తేడా చెరిగిపోతోంది. ఒకప్పుడు యుద్ధాలు భూభాగం కోసం జరిగితే, ఇప్పుడు ప్రజల ప్రాణాలకు ఎక్కువ విలువ ఇస్తున్నారు. గతంలో శత్రువులకు కలిగించిన నష్టం ఆధారంగా విజయాన్ని అంచనా వేసేవారు. కానీ ఇప్పుడు, ఆపరేషన్ల వేగం, కచ్చితత్వంతో కూడిన దాడులు విజయాన్ని నిర్ధారిస్తున్నాయి" అని ఆయన తెలిపారు. 'వికసిత భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశం 'సశస్త్ర', 'సురక్షిత్', 'ఆత్మనిర్భర్'గా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. కేవలం సాంకేతికతలోనే కాకుండా, ఆలోచనలు, ఆచరణలో కూడా స్వయం సమృద్ధి సాధించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వాయు, జల, భూతల మార్గాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి త్రివిధ దళాల మధ్య మరింత సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్న విషయం తెలిసిందే. రెండు రోజుల పాటు జరిగే ఈ 'రణ్ సంవాద్' సదస్సు ముగింపు కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించనున్నారు.

## సముద్రంలో శత్రువులకు చెక్.. నౌకాదళంలోకి రెండు స్వదేశీ యుద్ధనౌకలు



భారత రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానం మరోసారి తన సత్తాను చాటింది. దేశీయంగా నిర్మించిన రెండు అత్యాధునిక నీలగిరి-క్లాస్ స్టెల్త్ యుద్ధనౌకలు 'ఐఎన్ఎస్ హిమగిరి', 'ఐఎన్ఎస్ ఉదయగిరి' మంగళవారం నౌకాదళంలోకి ప్రవేశించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో ఈ రెండు యుద్ధనౌకలను లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోని రెండు వేర్వేరు ప్రతిష్ఠాత్మక షిప్‌యార్డ్‌ల నుంచి ఒకేసారి రెండు ప్రధాన యుద్ధనౌకలను ప్రారంభించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ప్రాజెక్ట్ 17 ఆల్ఫా (పీ-17ఏ)లో భాగంగా ఈ యుద్ధనౌకలను నిర్మించారు. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను, సాంకేతికతను వినియోగించారు. ఇది 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని అధికారులు తెలిపారు. ఐఎన్ఎస్ హిమగిరిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) నిర్మించగా, ఐఎన్ఎస్ ఉదయగిరిని ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎల్) తయారుచేసింది. ఈ రెండు నౌకలు ఒకేసారి దళంలోకి చేరడం, దేశీయ నౌకా నిర్మాణ సామర్థ్యం ఎంతగా పెరిగిందో తెలియజేస్తోందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకలు తూర్పు నౌకాదళంలో సేవలు అందించనున్నాయి. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యాన్ని, వారి 'ముత్యాల హారం' వ్యూహాన్ని అడ్డుకోవడంలో ఈ యుద్ధనౌకలు కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. ఈ నౌకల చేరికతో భారత నౌకాదళ యుద్ధ సన్నద్ధత మరింత పెరిగింది.

**నౌకల ప్రత్యేకతలివే..**

సుమారు 6,700 టన్నుల బరువు, 149 మీటర్ల పొడవు ఉండే ఈ నౌకలు గంటకు 28 నాట్ల (సుమారు 52 కిలోమీటర్లు) వేగంతో ప్రయాణించగలవు. వీటిలో అత్యాధునిక స్టెల్త్ టెక్నాలజీని వాడటం వల్ల శత్రువుల రాడార్లకు సులభంగా చిక్కవు. బరాక్-8, బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు, 76 ఎంఎం గన్ లతో వీటిని శక్తిమంతం చేశారు. అంతేకాదు, టార్పెడోలను ఎదుర్కొనే మారీచ్ వంటి పటిష్ట వ్యవస్థలను వీటిపై మోహరించారు. అంతేకాకుండా, రెండు హెలికాప్టర్లను కూడా ఆపరేట్ చేయగల సామర్థ్యం వీటి సొంతం.

# రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయకులు పంపిణీ...




**మియాపూర్(ప్రభాత సూర్య :**వినాయక చవితి పర్వదినాన్నీ పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేయడం ప్రశంసనీయమని మియాపూర్ డివిజన్ బిజెపి సీనియర్ నాయకులు గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు మంగళవారం రోజు మియాపూర్ డివిజన్ పరిధిలోని వివిధ అపార్ట్ మెంట్ లలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గణేష్ ముదిరాజ్ మాట్లాడుతూ మట్టి వినాయకులను పూజించడం ద్వారా పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వాళ్ళమవుతామని భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండడానికి కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేసే బాధ్యత మనందరికీ ఉందని పేర్కొన్నారు. పిఓపి వినాయక విగ్రహాలు వాడటం వల్ల నీటి కాలుష్యం బాగా వ్యాప్తి చెందుతుందని మట్టి విగ్రహాలని అందరూ పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారా శ్రీను, రాము, కొంచ శివరాజ్ ముదిరాజ్, నరేష్ చారి, వివేక్, నిష్కల్ తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలకి వినాయక చవితి శుభాకాంక్షలు...

జాతీయ బిసి సంక్షేమ సంఘం శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు వల్లెపు మాధవరావు.



**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :**శేరిలింగంపల్లి నియోజక వర్గం ప్రజలకి జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు వల్లెపు మాధవరావు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకి, పాత్రికేయ మిత్రుల కి,అధికారులకు, అనధికారులకు, ప్రజా ప్రతినిధులకు విఘ్నాలు తొలగించి విజయాలు సాధించాలని ఆ విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు అందరి పై ఉండాలనీ ఆశిస్తూ అందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సామూహిక, సామరస్య వాతావరణం లో జరుపుకునే ఈ అపూర్వమైన చవితి వేడుకలను భక్తి శ్రద్ధలతో సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## సైబర్ నేరాల కట్టడికి అప్రమత్తత ఒక్కటే మార్గం

-చౌటుప్పల్ సిఐ జి. మన్మధ కుమార్




**చౌటుప్పల్.ఆగస్టు 26. ప్రభాత సూర్య:** వ్యక్తిగత సమాచారాన్ని లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని వాటి కట్టడికి అప్రమత్తత ఒక్కటే మార్గమని చౌటుప్పల్ సిఐ జి మన్మధకుమార్ తెలిపారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణంలోని శ్రీగాయత్రి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీఐ జి మన్మధ కుమార్ రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఆదేశాల మేరకు, చౌటుప్పల్ ఏసిపి పి. మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో మాదకదవ్యాలు, సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జి మన్మధ కుమార్ మాట్లాడుతూ... సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థి దశలోనే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. ఈ మధ్యకాలంలో యువత తెలిసి తెలియక మాదకద్రవ్యాలకి బానిస కావడం, సోషల్ మీడియాను తప్పుగా వాడటం, ఈ మధ్య జరిగే సైబర్ క్రైమ్ వంటి విషయాలలో అవగాహన లేకపోవడం వల్ల చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని విద్యార్థులకు తెలిపారు. చిన్నపిల్లలపై నేరాలు ఎక్కువయ్యాయని వాపోయారు. షీ టీమ్స్ గంజాయి, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు వంటి విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్ 1930, డయల్ 100,181 వంటి నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులు చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అజయ్ భార్గవ్, ఏ ఎస్ ఐ జానయ్య, డబ్ల్యూ పీసీ మమత, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## అక్రమంగా నిర్మించిన చర్చిని కూల్చివేయాలి



విహెచ్పి ఆధ్వర్యంలో
గ్రామ కార్యదర్శి కి వినతి

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 26( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో అక్రమంగా చర్చ్ నిర్మించి అన్యమత ప్రచారం చేస్తున్నారు. గ్రామ కంఠానికి చెందిన భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి వృద్ధులకు, వికలాంగులకు బిర్యానీ, వళ్ళు చేయిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ కంఠ భూమిలో నిర్మితమైన క్రైస్తవ పార్దన మందిరాన్ని కూల్చివేయాలి అని సంస్థాన్ నారాయణపురం గ్రామ కార్యదర్శి కి మండల విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు . ఈ కార్యక్రమం లో విశ్వహిందూ పరిషత్ మండల ఉపాధ్యక్షులు రాసామళ్ళ ముత్యాలు, ప్రధాన కార్యదర్శి పట్నం బాలకృష్ణ, వి. హెచ్. పి కార్యకర్తలు కిషోర్, మంజునాథ్ రెడ్డి, చెదురువెల్లి సాయి, ఏనుగు శివ, పాలకూర్ల నాగరాజు, బొంగు మధు, కడారి నరేష్, బోయిని కిరణ్, అజయ్,తదితరులు పాల్గొన్నారు

## మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసిన

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**రామడుగు, ఆగష్టు 26( ప్రభాత సూర్య):** రామడుగుజి మండలంలోని కాట్నపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఛైర్మన్ గన్ను రాజు ఆధ్వర్యంలో చేపట్టిన మట్టి వినాయకుల విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం పాల్గొని మట్టి గణపతులను గ్రామస్తులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ఉపయోగించడం మంచి పరిణామమని, రాబోవు కాలంలో నియోజకవర్గంలో అన్ని చోట్లా వినాయక చవితికి మట్టి విగ్రహాలను ఉపయోగించేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల నైపుణ్యానికి అద్దం పట్టిన టీ ఎల్ ఎం మేళా



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 26( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో కేంద్రంలో టి.ఎల్.ఎం మేళాను మండల విద్యాధికారి గోలి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహశీల్దార్ పి. శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ప్రమోద్ కుమార్ పాల్గొని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రదర్శించిన బోధనాభ్యసన సామాగ్రిని పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఆర్. రమాదేవి, కె.ఉదయ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. హనుమంతు, రఘుమారెడ్డి,సీఎచ్. అశోక్, మండల రిసోర్సు పర్సన్స్, ఉపాధాయినీ,ఉపాధ్యాయులు ఎం ఆర్ సి సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేళాలో మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరచి ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను జిల్లా స్థాయికి ఎంపిక చేయటం జరిగింది.

## విద్యార్థుల అవగాహన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది

మట్టిని ప్రేమించు, పూజించు, పర్యావరణాన్ని రక్షించు
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సందేశం



**ప్రభాత సూర్య ప్రతినిధి, (మర్రిగూడ):** జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల విద్యార్థులు మట్టి గణపతిని పూజించు, పర్యావరణాన్ని రక్షించు అనే నినాదంతో ప్రజలలో అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీని నిర్వహించారు. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల విద్యార్థులు మట్టి గణపతులపై అవగాహన కల్పించారు. మట్టిని ప్రేమించు, మట్టి గణపతిని పూజించు, పర్యావరణాన్ని రక్షించు అనే నినాదాలతో విద్యార్థులు మట్టితో తయారుచేసిన విగ్రహాలతో భారీ ర్యాలీని నిర్వహించారు.. తమ పాఠశాల నుంచి బస్సు డిపో వరకు మట్టి గణపతి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ అవశ్యకతను తెలియజేస్తూ వారి సందేశాన్ని భారీ ర్యాలీతో నిర్వహించారు.. ఈ ర్యాలీలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు...

## గట్టుప్పల్ మండల కేంద్రంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



**గట్టుప్పల్, ప్రభాతసూర్య ఆగస్టు 26:** వినాయక చవితి సందర్భంగా గట్టుప్పల్ మండల కేంద్రంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గట్టుప్పల మండల అభివృద్ధి అధికారి (ఎండిఓ) జూలకంటి మాధవరెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, అలాగే పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టే విధంగా మట్టి విగ్రహాలను ప్రతిష్టించాలని మండల ప్రజలను కోరారు. పంపిణీ కార్యక్రమంలో గట్టుప్పల్ గ్రామపంచాయతీ కార్యదర్శులు షఫీ, శ్రీనివాస్, వివిధ పార్టీ నాయకులు నామని జగన్నాథం, నామని బుచ్చయ్య, కర్నాటి సుధాకర్, మాదగాని సత్తయ్య, కర్నాటి వెంకటేష్, చెరిపెల్లి ఆంజనేయులు, లక్ష్మయ్య, సత్తయ్య, కోటయ్యతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది సురేష్, అంజమ్మ, సైదులు, కృష్ణయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గట్టుప్పల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**గట్టుప్పల్, ఆగస్టు ప్రభాతసూర్య 26:** గౌరవ జిల్లా కలెక్టర్ గారు ఈరోజు గట్టుప్పల మండల కేంద్రంలోని ఎస్టి హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతులు, వసతి గృహాల పరిస్థితి వంటి అంశాలను స్వయంగా పరిశీలించారు. తదుపరి కలెక్టర్ గారు గట్టుప్పల మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనులు ఆలస్యం కాకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చందూరు ఆర్డీవో టి.కే. శ్రీదేవి, గట్టుప్పల తహసిల్దార్ కె. రాములు, గట్టుప్పల ఎంపీడీవో జె. మాధవరెడ్డి, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎం.డి. షఫీ తదితర అధికారులు పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో 51 ఏండ్ల జైలు

సంచలన తీర్పులకు కేరాఫ్ గా నల్గొండ కోర్ట్



**నల్గొండ ఆగస్టు 26 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. దోషికి 51 ఏళ్ల కఠిన కారాగార శిక్షను విధించింది.అంతేకాదు 85 వేలు జరిమానా విధిస్తూ బాధితురాలికి 7 లక్షల పరిహారం అందించాలని నల్గొండ జిల్లా కోర్టు ఆదేశించింది. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలానికి చెందిన బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడు ఖయ్యూంకి కఠిన కారాగార శిక్షను కోర్టు విధించింది. క్రైమ్ సంఖ్య 242/2021, తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. . నం.94/2022 లో, తిప్పర్తి గ్రామం, మండలానికి చెందిన నిందితుడు ఖయ్యూంను ఎస్సీ, ఎస్టీ. కోర్ట్ జడ్జి రోజా రమణి దోషిగా తేల్చారు.

## మేకల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్




**నల్గొండ ఆగస్టు 26 ప్రభాత సూర్య** ఖరీదైన కార్లలో రాత్రి సమయాలలో మేకల దొంగతనాలకు పాల్పడుతున్న నాలుగు అంతర్ జిల్లా దొంగల ముఠాలను అరెస్టు చేసిన నల్గొండ జిల్లా పోలిసులు. జిల్లా యస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ నాలుగు ముఠాలు దొంగల ముఠాలలో మొత్తం 16 మంది సభ్యులు అరెస్టు చేశారు.

## సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్గొండ ఫోటో జర్నలిస్టులకు సన్మానం



**నల్గొండ ఆగస్టు 26 ప్రభాత సూర్య** నల్గొండ జిల్లా కేంద్రంలోని మంగళవారం సుంకరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకర మల్లేష్ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బ గోని రమేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ వేణుగోపాల్ రెడ్డి లు నల్గొండ ఉత్తమ ఫోటోగ్రాఫర్ల జర్నలిస్టులకు ముచ్చర్ల విజయ్ ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్, బజరంగ్ ప్రసాద్ సాక్షి ఫోటోగ్రాఫర్, ముచ్చర్ల శ్రీను హాన్స్ ఇండియా, ఫోటోగ్రాఫర్ , కారింగు శ్రీను మనం ఫోటోగ్రాఫర్, కారింగ్ వెంకన్న నవతెలంగాణ ఫోటోగ్రాఫర్ లకు సన్మానం చేసి మాట్లాడారు భవిష్యత్తులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మరిన్ని అవార్డులు గెలుపొందాలని ఆకాంక్షించారు.

# మరణించిన కుటుంబాలకు రూ.20,000ఆర్థిక సహాయం


ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి

మహిళా సంఘాల సమావేశంలో మండల తహసిల్దార్ సూచన



**ప్రభాత సూర్య ప్రతినిధి, (మర్రిగూడ):** అర్హత కలిగిన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకునే విధంగా విస్తృతంగా ప్రచారం చేసి దరఖాస్తులు చేయించాలని మండల తహసిల్దార్ సూచించారు. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోనీ మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల తహసిల్దార్ మాట్లాడుతూ... నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు అర్హత కలిగిన కుటుంబాలు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలన్నారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు ఈ పథకం కింద రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందజేయబడుతుందని తెలిపారు. ప్రాథమిక జీవనాధారాన్ని కోల్పోయిన కుటుంబాలకు జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్ బీ ఎస్) వర్తిస్తుందని అన్నారు. ప్రాథమిక జీవనాధార వ్యక్తి మరణించినట్లయితే, అతని వయస్సు 18 ఏళ్లు పైబడి, 60 ఏళ్లలోపు ఉండాలని అన్నారు. చనిపోయిన వ్యక్తి 12.04.2017 తరువాత చనిపోయి ఉండాలి. అర్హులైన వారు తమ తమ గ్రామ పంచాయతీ కార్యాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన కుటుంబాలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు తహసిల్దార్ సూచించారు...దరఖాస్తుదారుడు జత చేయవలసిన పత్రాలు 1. మరణ ధ్రువీకరణ పత్రం జతపరచాలి. 2. సంవత్సరం ఆదాయం 60 వేల లోపు ఉండాలి. 3. దరఖాస్తుదారుని బ్యాంక్ అకౌంట్. 4. దరఖాస్తు దారిని ఆధార్ కార్డు. 5. దరఖాస్తుదారుని రేషన్ కార్డు. 6. దరఖాస్తు దారిని రెండు పాస్ ఫోటోలు జత చేయాలి. ఈ కార్యక్రమంలో .సీసీ లు మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

# వినాయక చవితి పురాణ గాథలు, ఉత్సవ విశిష్టత





**గట్టుప్పల్ ప్రభాతసూర్య 27** వినాయకుడి జననం పార్వతీదేవి స్నానానికి వెళ్తూ తన దేహంలోని చర్మపు మలినంతో ఒక బాలుడిని సృష్టించింది. అతనికి ప్రాణం పోసి, తలుపు వద్ద కాపలా ఉండమని చెప్పింది. ఆ సమయంలో వచ్చిన శివుడు లోపలికి వెళ్ళడానికి ప్రయత్నించగా ఆ బాలుడు ఆపాడు. ఆగ్రహించిన శివుడు అతని తల నరికి వేయగా, పార్వతీ తీవ్రంగా ఆవేదన చెందింది. చివరికి శివుడు గజముఖమున్న ఏనుగు తలను అమర్చాడు. ఆ విధంగా విఘ్నేశ్వరుడు గణపతి జన్మించాడు. గజాసురుని తపస్సుగజాసురుడు అనే రాక్షసుడు శివుని ప్రసన్నం చేసుకోవడానికి గాఢతపస్సు చేశాడు. తపస్సుతో ఆనందించిన శివుడు అతనికి వరం ఇచ్చాడు. గజాసురుడు, "మీరు నా కడుపులోనే ఉండాలి" అని కోరాడు. శివుడు అంగీకరించగా, లోకానికి శివదర్శనం లేకపోయింది. అప్పుడు దేవతలు వినాయకుడిని ప్రార్థించి సహాయం కోరగా, వినాయకుడు గజాసురుడిని సంహరించి శివుని విడుదల చేశాడు. ఇంతటితో గణపతి విఘ్ననాశకుడిగా ప్రసిద్ధి పొందాడు. చంద్రుడు మీద శాపం ఒకసారి వినాయకుడు ముషికవాహనుడిపై విహరిస్తూ ఉండగా, చంద్రుడు ఆయన శరీరాన్ని చూసి హాస్యం చేశాడు. కోపగించిన వినాయకుడు చంద్రుణ్ణి శపించాడు"ఎవడు నిన్ను చుస్తాడో వాడికి అపవాదలు వస్తాయి" అని. అప్పటి నుంచి వినాయక చవితి రోజున చంద్రుణ్ణి చూడరాదు అన్న నమ్మకం ఏర్పడింది. తరువాత చంద్రుడు క్షమాపణలు కోరగా, వినాయకుడు శాపం కొంత శాంతింపజేశాడుఆ రోజున చంద్రుణ్ణి చూడటం వల్ల కలిగిన అపవాదం వినాయకుని వ్రతం చేసి, కథ వినడం వల్ల తొలగిపోతుందని నిర్ణయమిచ్చాడు. వినాయకుడి విజయాలు గణపతి ఎప్పుడూ తల్లిదండ్రులను మొదట పూజించే గొప్పతనం చూపించాడు. ఒకసారి శివుడు, పార్వతీ, కుమారులైన గణపతి, కుమారస్వామికి ప్రపంచప్రదక్షిణ చేయమని అన్నారు. కుమారస్వామి క్షణాల్లోనే విహరించడానికి బయల్దేరాడు. కానీ గణపతి మాత్రం తల్లిదండ్రులను చుట్టూ ప్రదక్షిణ చేసి, "తల్లిదండ్రులే జగత్తు" అని చెప్పాడు. అందుచేత గణపతి విజేతగా నిలిచాడు. ఈ సంఘటనతో ఆయనను మొదట పూజించాల్సిన దేవుడుగా నిర్ణయించారు. వినాయక వ్రతం, పూజావిధానం వినాయక చవితి రోజున భక్తులు మట్టితో గణపతి విగ్రహం తయారు చేసి పూజిస్తారు. పూజలో ప్రధానంగా వినాయకుని జననకథ వినడం అష్టదళ పూజ, మంత్రజపం చేయడం అక్షతలతో నైవేద్యం సమర్పించడం వినాయకుని వ్రతకథ చదవడం "విఘ్ననాశక గణపతి"ని ప్రార్థించడం వ్రతం పూర్తయ్యాక గణపతి విగ్రహాన్ని జలప్రవాహం (విసర్జన) చేయడం ఒక ముఖ్య సంప్రదాయం. ఇది మనలోని అహంకారాలను, విఘ్నాలను గణపతికి అప్పగించి, మనసును శుద్ధి చేసుకోవడమే అని భావిస్తారు. గణేశుడికి మొదటి పూజ ఎందుకు? హిందూ సంప్రదాయంలో "విఘ్నేశ్వరుడు" అనే పేరు గణేశుడికి ఉంది. అంటే విఘ్నాలను తొలగించేవాడు. అందుకే ఏ శుభకార్యం మొదలు పెట్టేముందు గణేశపూజ తప్పనిసరిగా చేస్తారు. దీనికి అనేక పురాణకారణాలు ఉన్నాయి: ప్రపంచ ప్రదక్షిణ కథ (మొదటి పూజ హక్కు) ఒకసారి దేవతల మధ్య "ఎవరు మొదట పూజ పొందాలి?"






అనే వాదన వచ్చింది. శివుడు, పార్వతీ నిర్ణయించారు: "ప్రపంచం అంతా ప్రదక్షిణ చేసి తొలుత తిరిగి వచ్చేవాడే మొదటి పూజకు అర్హుడు." అందుకు దేవతలందరూ తమ వాహనాలపై బయలుదేరారు. కానీ గణేశుడు మాత్రం తన తల్లిదండ్రులైన శివపార్వతుల చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ చేసి "తల్లిదండ్రులే జగత్తు" అని తెలిపాడు. ఆ జ్ఞానం చూసి శివపార్వతులు సంతోషించి గణేశుని మొదటి పూజకు అర్హుడిగా నిర్ణయించారు. విఘ్నాలను తొలగించేవాడు గణేశుడు విఘ్నేశ్వరుడు. భక్తుల జీవితంలో వచ్చే ఆటంకాలను తొలగించే శక్తి ఆయనకు ంంంంంఉంది. అందువల్ల ఏ శుభకార్యమూ ఆయన ఆశీర్వాదంతోనే విజయవంతం అవుతుందని విశ్వాసం.గణేశ చతుర్థి జన్మదినం పార్వతీదేవి భాద్రపద శుద్ధ చతుర్థి రోజున గణేశుడిని పుట్టించిందని పురాణం చెబుతుంది. ఆ రోజే ఆయన జన్మదినం కాబట్టి ప్రత్యేక పూజా సంప్రదాయం ఏర్పడింది. చంద్రునిపై శాపం గణేశుడు ముషికవాహనుడిపై తిరుగుతుండగా చంద్రుడు ఆయన రూపాన్ని చూసి హాస్యం చేశాడు. ఆగ్రహంతో గణేశుడు "వినాయక చవితి రోజున నిన్ను చూసినవారికి అపవాదలు వస్తాయి" అని శపించాడు. తరువాత శాపం కొంత తగ్గించినా, ఆ రోజున గణేశపూజ తప్పనిసరి అయింది. మహాభారత రచనలో పాత్ర మహర్షి వేదవ్యాసుడు మహాభారతాన్ని వ్రాయించేటప్పుడు గణేశుని శాసకునిగా నియమించాడు. నిరంతరంగా, ఆపకుండా ఆయన రచనలో సహకరించాడు. ఈ ఘనకార్యం వల్ల కూడా గణేశుడు విద్య, జ్ఞానం, రచనల దేవుడుగా పూజలందుకున్నాడు. మట్టి విగ్రహారాధనకు కారణం గణేశుని మట్టివిగ్రహ రూపంలో పూజించడం వెనుక తాత్పర్యం ఉంది. మట్టి (భూమి) అనేది జడశక్తి. దానిలో ప్రాణశక్తిని కలిపితేనే జీవనానికి అర్థమని ఈ సంప్రదాయం చెబుతుంది. అందుకే గణేశపూజలో మట్టివిగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేస్తారు.వినాయక చవితి పది రోజుల ఉత్సవం వినాయక చవితి కేవలం ఒక రోజు పూజ మాత్రమే కాకుండా, పది రోజుల మహోత్సవంగా జరుపుకునే సంప్రదాయం పురాణాలు, ఆధ్యాత్మికత, సామాజిక కారణాల వల్ల ఏర్పడింది. వేదవ్యాస మహర్షి మహాభారత రచన కథ మహాభారతాన్ని రచించాలనుకున్న వేదవ్యాసుడు ఒక నిరంతర లిఖయిత కోసం ప్రార్థించాడు. గణేశుడు ముందుకొచ్చి, "నేను ఒకసారి వ్రాయడం మొదలెడితే ఆగను. నువ్వు ఎటువంటి సందేహం లేకుండా నిరంతరం శ్లోకాలను చెప్పాలి" అని షరతు పెట్టాడు. వ్యాసుడు కూడా తెలివిగా ఒక షరతు పెట్టాడు %-% "నువ్వు అర్థం తెలిసాకే వ్రాయాలి" అని. ఇలా ఇద్దరూ పది రోజులపాటు ఆగకుండా రచన సాగించారు. ఆ విశిష్ట ఘట్టాన్ని గుర్తుచేసుకోవడానికి గణేశ పూజ పది రోజులపాటు జరుగుతుందని పురాణం చెబుతుంది. వినాయకుడు భూలోకంలో పదిరోజులు నివసించిన పురాణం కొన్ని పురాణాల ప్రకారం, గణేశుడు తన తల్లిదండ్రులైన శివపార్వతుల అనుమతితో కైలాసం నుండి భూమికి వచ్చి పదిరోజులపాటు భక్తుల మధ్య ఉండి ఆశీర్వదించి తిరిగి వెళ్ళాడు. అందుకే ఆ పదిరోజులను గణపతి భక్తులు ఉత్సాహంగా ఆరాధనలో గడుపుతారు. ఆధ్యాత్మిక శుద్ధి సమయం ఈ పది రోజులు మనసు, శరీరం, ఆత్మ శుద్ధికి అంకితం చేస్తారు. ఉపవాసాలు, జపం, ధ్యానం చేస్తారు చెడు అలవాట్లను విడిచిపెడతారు సత్సంగం, భజనలు, హారతులు జరుగుతాయి దీని వలన భక్తులకు మనోబలం, ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని నమ్మకం ఉంది. విగ్రహ నిమజ్జనం జీవచక్ర ప్రతీక పది రోజుల పూజ అనంతరం విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేస్తారు. ఇది జననం మరణం లయ అనే జీవచక్రాన్ని సూచిస్తుంది. మట్టి విగ్రహం మళ్ళీ మట్టిలో కలిసినట్లే, మనిషి కూడా ప్రకృతిలో కలిసిపోతాడనే భావన ఉంది. సామూహిక, సాంప్రదాయ ఉత్సవాలు ఈ పది రోజులలో గణపతి మండపాలు, పందిళ్లు సామూహిక ఉత్సవాలకు వేదికవుతాయి కళలు, సంగీతం, హారతులు, నృత్యాలు, నాటకాలు జరుగుతాయి అన్నదానాలు, సామూహిక పూజలు, సామాజిక ఐక్యత పెరుగుతాయి ఈ విధంగా గణేశోత్సవం కేవలం భక్తిపరమైనది మాత్రమే కాకుండా సామాజిక ఐక్యత, సాంస్కృతిక సంపదకు ప్రతీకగా నిలుస్తుంది.

## 2యేండ్లలో మునుగోడు సస్య శ్యామలం

డీసీసీ ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 26( ప్రభాత సూర్య ):** చర్లగూడెం రిజర్వాయర్ నుండి నారాయణపురం,చౌటుప్పల,మండల ప్రాంతం లో రైతంగానికి సాగు నీళ్లు అందించేందుకు మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డీ ఇంజనీర్ బృందం, శాఖలా అధికారులచే నిరంతరం అహర్నిశలు కృషి చేస్తున్నారని డీసీసీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ అన్నారు. శివన్నగూడెం నారాయణపురం, చౌటుప్పల,లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో భాగంగా నారాయణపురం మండలం వావిల్లపల్లి పరిధిలో ని గోసుగుండు అటవీ ప్రాంతంలో ఒకటిన్నర టీఎంసీ ల కేపాసిటీ సామర్థ్యం గల రిజర్వాయర్ ను నిర్మించి అక్కడి నుండి చౌటుప్పల్ మండల పరిధిలో ని దేవాలమ్మా నాగారం సమీపంలో 4 టీఎంసీ కాపాసిటి సామర్థ్యం గల మరో రిజర్వాయర్ ను నిర్మించి దాదాపు 65000 ఎకరాలకు పైగా సాగు నీళ్లు అందించవచ్చని, ఈ రిజర్వాయర్ ల కింద ఉన్నా లింక్ చెరువులను నింపి వందల ఎకరాలలో భూగర్భ జలాలు అభిరిద్దులోకి వస్తాయని అన్నారు. ఇంద్రాసేన రెడ్డి నేతృత్వంలో రిటైర్ ఇంజనీర్ల బృందం గోసుగుండు ప్రాంతం లో పర్యటించి 1200 కోట్ల రూపాయలు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదక పంపడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లు కూడా శాఖ పరమైన అనుమతులు ఇవ్వడం జరిగిందంనారు ,కొద్ది రోజులోనే డిపిఆర్ కోసం అధికారుల బృందం సర్వే పనులు మొదలు పెట్టె అవకాశం ఉందన్నారు. వచ్చే 2 యేండ్ల కాలంలో ఈ ప్రాంతాల్లో బీడు భూములను సాగులోకి వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటికే పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎదుల రిజర్వాయర్ నుండి చర్లగూడెం రిజర్వాయకు కృష్ణా నీళ్లు మల్లించడానికి 1800 కోట్ల రూపాయలతో ఎమ్మెల్యే రాజన్న కృషితో ప్రభుత్వ పరంగా అనుమతులు వచ్చాయని, పనులు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. మునుగోడు నియోజక ప్రాంతం కరువు సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి రైతుల పక్షాన ధన్యవాదములు తెలుపుతున్నామని అన్నారు.ఈ కార్యక్రములో కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్ సీనియర్ నాయకులు కత్తుల లక్ష్మయ్య, జక్కిడి బాల్ రెడ్డి, సుర్వి ముత్యాలు, కురిమిద్దె గోపాల్, కోన్ రెడ్డి నరసింహ, ఉప్పల రాజయ్య, కొర్ర రాములు నాయక్, మొగుడాల అబ్బయ్య, ముత్యాల గాలయ్య కుమ్మరి పాల అంజయ్య, పాలకూర్ల సహదేవ, రసమళ్ళ కృష్ణాస్వామి, రేవనపల్లి బిక్షపతి, ముత్యాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.


## తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

-కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహా గౌడ్



**చౌటుప్పల్.ఆగస్టు 26. ప్రభాత సూర్య :** నేడు వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని చౌటుప్పల్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ ప్రజలందరికీ హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. విఘ్నాలను తొలగించే విగ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలు నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎటువంటి ఆటంకాలు లేకుండా చేరుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రతి కుటుంబం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, వాడవాడల గణపతి మండపాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య గణపతిని పూజిస్తున్న భక్తుల అందరికీ సకల శుభాలు కలగాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్థిక సహాయం అందజేత



**చౌటుప్పల్, ఆగష్టు 26( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పరిధిలోని నేలపట్ల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004-2005 పదవ తరగతి పూర్వ విద్యార్థులు వర్కట్ పల్లి గ్రామానికి చెందిన మీసాల నరేష్ మరణించారు. మరణించిన విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు మృతి దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించి 33,000/- వేల రూపాయలు చౌట శివకుమార్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొంపల్లి మహేష్ , గుర్రం సుదిరాజ్ , ప్రసాద్ అనిల్ కుమార్ , మీసాల శివ , మహేష్ , ఐలయ్య , రాజు , నరేష్ , లింగస్వామి , క్రాంతి , సత్యం , మాజీ సర్పంచ్ మీసాల శేఖర్ తదితరులు ఉన్నారు.

## గర్బస్థ లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం డాక్టర్ కళావతి బాయి

**ఖమ్మం :** గర్బస్థ లింగ నిర్ధారణ చట్ట విదద్దమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి అన్నారు. కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం గర్భస్థ పూర్వ, గర్బస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా డాక్టర్ కళావతి బాయి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో జరిగే ప్రతి స్కానింగ్ కు సంబంధించి ఫారం ఎఫ్ రూపొందించి ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు ఖమ్మం జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 988 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్బస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేలు జరిమాన విధించబడుతుందని,అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లింగ నిర్ధారణ అరికట్టుటకు ప్రతి నెల స్కానింగ్ సెంటర్లను తనిఖీలు చేస్తునమాని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులలో జరుగుతున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందా అని పరిశీలించాలని డిఎంహెచ్ఓ

# మట్టి వినాయక విగ్రహాలను పూజించండి పర్యావరణ పరిరక్షణకు పాటుపడండి

-చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకటరామిరెడ్డి

**చౌటుప్పల్. ఆగస్టు 26. ప్రభాత సూర్య.** ప్రతి ఒక్కరు మట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమలను వాడి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని జి.వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో సుధ పిల్లల వైద్యశాల, దంత వైద్యశాల డాక్టర్ అవ్వారి శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ అవ్వారి నీరజ దేవిల సౌజన్యంతో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చౌటుప్పల మున్సిపల్ ఆఫీస్ ముందర చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రామిరెడ్డి పాల్గొని వారి చేతుల మీదుగా భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ గుత్త వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఆధ్వర్యంలో గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వందల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. చౌటుప్పల మున్సిపాలిటీలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా మట్టి వినాయకుడిని పూజించండి పర్యావరణ. పరిరక్షణకు పాటుపడండి అని పిలుపునిచ్చారు. రసాయనాలతో తయారుచేసిన వినాయక విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసినప్పుడు ఆ కలర్స్ నీటిలో కరిగి అనేక జలచర జీవులు మరణిస్తాయని అన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ భూమిలో కరగడానికి వందల సంవత్సరాలు పడుతుందని, అదేవిధంగా భూమ్మీద జీవరాశులకు అనేక రోగాలకు కారణ ము అవుతుందని అన్నారు. కనుక మట్టి వినాయక విగ్రహాలను పూజించి చెరువులు నిమజ్జనం చెరువు, నీటిని, జలచరాలను కాపాడిన వాళ్ళం అవుతామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ అధ్యక్షులు తిరందాస్ జగన్నాథ్, కార్యదర్శి ఎండి హతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ పోలోజు శ్రీనివాస చారి, జిల్లా కమిటీ సభ్యులు



గోశిక కరుణాకర్, నాంపల్లి రమేష్, కొసనం రామ్ రెడ్డి, కాసుల వెంకటేశం, బొబ్బిల మురళి, కామిశెట్టి చంద్రశేఖర్, కామిశెట్టి భాస్కర్, వేముల నరసింహ, వనం రాజు, సురోజు సత్యనారాయణ చారి, చింతల ప్రభాకర్ రెడ్డి, దీప అనిల్, పోలోజు రాజు చారి, దాచేపల్లి శ్రీను, సంపూర్ణ చారి, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**చౌటుప్పల్.ఆగస్టు 26. ప్రభాత సూర్య.** గణేష్ నవరాత్రుల ఉత్సవాల అనంతరం గణేష్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లలో భాగంగా చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి పెద్దకొండూరు గ్రామ చెరువును సందర్శించి శోభయాత్ర ఏర్పాట్లను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. గణనాథులను నిమజ్జనం చేయుటకోసం తగిన ఏర్పాట్లు గురించి అధికారులతో చర్చించారు. గణనాథులను నిమజ్జనం చేయుటకు వచ్చేటువంటి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను సమకూర్చాలని గ్రామపంచాయతీ అధికారులకు సూచించారు. నిమజ్జనం జరిగే చోట తగిన ఏర్పాట్లపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులు గణపతి ప్రతిమలను నిమజ్జనానికి తీసుకురానున్న దృష్ట్యా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనానికి సంబంధించి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు



సమన్వయంతో పనిచేయాలని, ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రలు జరిగేలాగా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎస్ కృష్ణ మాల్, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, పర్యావరణ ఇంజనీర్ వేణు కుమార్, పంచాయతీ సెక్రటరీ శ్రీశైలం, గ్రామ కారోబార్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఎం నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తూ తుర్కయాంజాల్ చౌరస్తాలో నిరసన

**తుర్కయంజాల్,ఆగస్టు 26, ప్రభాత సూర్య:** సీలింగ్ పట్టా రైతులకు ప్రభుత్వం వెంటనే పాస్ బుక్ లను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అబ్దుల్లాపూర్ మెట్ మండలం అనాజ్ పూర్ గ్రామంలోని రైతులతో కలిసి సీలింగ్ భూములను పరిశీలించేందుకు ర్యాలీగా వెళ్తున్న సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ,ఏర్పుల నర్సింహ అలాగే పార్టీ జిల్లా నాయకులు స్థానిక రైతులు ప్రజలను పోలీసులు అప్రజాస్వామికంగా అరెస్టులు చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం తుర్కయాంజాల్ మున్సిపల్ కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు,తుర్కయాంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి.కిషన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య పాలన కొనసాగిస్తామని అధికారంలోకి వొచ్చి ఇప్పుడు నియంతృత్వంగా వ్యవహరించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. స్థానిక రైతులు న్యాయబద్ధంగా వారికి 1991లో అప్పటి ప్రభుత్వం 125 మంది రైతులకు సీలింగ్ భూముల పట్టాలు ఇచ్చిందనీ అందులో కొందరికి పట్టా పాస్ బుక్ లు సైతం ఉన్నాయన్నారు కొత్త చట్టం తెచ్చిన తర్వాత పాస్ బుక్ లను ఇవ్వకుండా, రైతుల వివరాలను ఆన్ లైన్ లో




చేర్చకుండా తాత్సారం చేస్తూ ఇప్పుడు భూముల ధరలు పెరగడంతో కొందరు రాజకీయ నాయకులు అధికారులతో కుమ్మక్కై పేదల భూములను లాక్కునే మొదలెట్టడం అన్యాయం అని అన్నారు. ఈ విషయంపై రైతులకు న్యాయం చేయాలని ప్రజాస్వామ్య బద్దంగా, శాంతియుతంగా ర్యాలీ తీస్తుంటే పోలీసులు నిబంధకాండను కొనసాగించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గారితో పాటు పార్టీ నాయకులను రైతులకు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని అన్నారు. వెంటనే రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బడుగు శంకరయ్య, అరెడ్ల మాధవరెడ్డి, ఐతరాజ్ కృష్ణ,పగిల్ల చిట్టిబాబు, కృష్ణ, సోమ్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పెన్షన్ పెంపు హామీలను వెంటనే అమలు చేయాలని మంద కృష్ణ మాదిగ డిమాండ్

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** వితంతువులను వృద్ధులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ను రేవంత్ రెడ్డిని నిలదీయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 9 2025 న చలో హైదరాబాద్ అనే కార్యక్రమం లో భాగంగా పరేడ్ గ్రౌండ్ వేదికగా వికలాంగులకు 4000 నుండి 6000 , వితంతువులకు 2000 నుండి 4000, వృద్ధులకు 2000 నుండి 4000 విలువ చేస్తానని మాట ఇచ్చినాడు కానీ ఇవ్వలే కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వికలాంగులకు వృద్ధులకు వితంతువులకు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచు డా కాంగ్రెస్ ప్రభుత్వం లో ఉన్న రేవంత్ రెడ్డి గద్దె దించుడా అనే డిమాండ్ తో కార్యక్రమం పెట్టడం జరిగింది. దానిలో భాగంగా ఈ సన్నాహక సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది చందానగర్ జిహెచ్ఎంసి మున్సిపాలిటీ కళ్యాణ మండపంలోశేర్లింగంపల్లి నియోజకవర్గ సన్నహక సదస్సు మందకృష్ణ మాదిగ సమక్షంలో ఏర్పాటు చేయడం




జరిగింది ఈ మీటింగ్ లో వికలాంగుల గురించి వితంతుల గురించి వృద్ధుల గురించి వారి స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూవచ్చేనెల సెప్టెంబర్ 9న చలో హైదరాబాద్ అనేక కార్యక్రమంలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుంది మీ నియోజకవర్గం నుండి ప్రతి ఒక్కరు వికలాంగులు వితంతువులు అందరూ భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో దివ్యాంగుల పట్టణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు ఎం.అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్ కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫకీర్ సాబ్ ,దివ్యాంగుల రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నంది నాగులు, ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్ మాదిగ, యాదగిరి మాదిగ , ప్రేమ్ కుమార్ మాదిగ, బేడ బుడగ జంగం జన సంఘం తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పత్తి బసవ శివ ,ఓంకార్ నగర్ కాలనీ మియాపూర్ బస్తివాసులు బస్తీ యూత్ నాయకుడు కళ్లెం రాజేష్, కళ్లెం చంద్రయ్య, ఇస్సాకు, కృష్ణ సిరిగిరి చంద్రప్ప ,వృద్ధులు వితంతువులు గరుడ అంజనమ్మ ,గరుడ మల్లమ్మ, మొక్కులోడు మీనాక్షి ,మొకలోడు అమ్మమ్మ, పూసలోల కళ్యాణి ,మోకలోడు శాంతి ,నిర్మల, అంజమ్మ, మానెమ్మ ,పుష్పారాణి, వడ్డే తయారమ్మ ,నారాయణ , ఇంద్రమ్మ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ వెల్ఫేర్ అధికారిని కలిసిన టిఆర్ఆర్ఎస్ జిల్లా కమిటీ

సహితి మేడంను సన్మానించిన జిల్లా అధ్యక్షులు జూపల్లి నగేష్




**భువనగిరి, ఆగష్టు 26(ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిని సహితి మేడం ని తన చాంబర్లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి భువనగిరి జిల్లా అధ్యక్షులు జూపల్లి నగేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాండ్ల బాల్ రాజ్,రత్నపురం పద్మ, జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పల వెంకటేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి మరిపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి బొల్లారం జహంగీర్, జిల్లా కమిటీ సభ్యులు అంబటి అంజయ్య,గొలనుకొండ పాండు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం నిధుల కేటాయించాలి

సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం




**గట్టుప్పల్, ఆగస్టు 26 (ప్రభాతంబతీఖు)** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలంటూ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండ శ్రీశైలం డిమాండ్ చేశారు. మంగళవారం గట్టుప్పల మండల పరిధిలోని తేరటుపల్లి గ్రామ సమస్యలపై ఆయన గ్రామపంచాయతీ కార్యదర్శి శివకి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశైలం అన్నారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రాజకీయ లాభాల కోసం ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మార్కండేయ కాలనీలో సీసీ రోడ్లు, మురికి కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తేరటుపల్లి, షేరిగూడెం, వెల్మకన్నె గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణం అత్యవసరమని డిమాండ్ చేశారు. అలాగే చండూరు ప్రధాన రహదారి నుండి స్కూల్ వరకు మురికి కాలువలు లేక వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు వర్షాకాలంలో పంట సాగు కోసం ముందస్తు ప్రణాళికలు అవసరమైనా, ప్రభుత్వాలు వాటిని విస్మరించి రాజకీయ ప్రయోజనాలపై దృష్టి సారించాయని విమర్శించారు. యూరియా కొరత కారణంగా రైతులు తెల్లవారుజామునే గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి కూడా ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారని ఆయన వాపోయారు. అలాగే గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యం అందించాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం నామాపురం, అంతంపేట గ్రామాల పంచాయతీ అధికారులకు కూడా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అచ్చిన శ్రీనివాసులు, పగిళ్ల శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, కట్ట యాదగిరి, వల్లూరి జంగయ్య, జోగు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఎస్.జి. ఎఫ్ క్రీడలకు దరఖాస్తు చేసుకోవాలి

-మండల విద్యాధికారి ఈ. గురువారావు



**చౌటుప్పల్. ఆగస్టు 26. ప్రభాత సూర్య:** 69వ మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడల నిర్వహణ గురించి మంగళవారం స్థానిక మండల ఎంఆర్సి కార్యాలయంలో మండల విద్యాధికారి గురువారావు అధ్యక్షతన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులతో సమావేశమును నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఈ గురువారావు మాట్లాడుతూ... వచ్చేనెల సెప్టెంబర్ 2వ తేదీన చౌటుప్పల్ మండలం, తంగేడి పల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఖో ఖో, వాలీబాల్, కబడ్డీ అండర్-14, అండర్ -17 స్థాయిలో బాలబాలికలకు మండల స్థాయి ఎంపిక నిర్వహించబడుతుందని తెలిపారు. అండర్ -14 క్రీడలలో పాల్గొనే బాల బాలికలు 01-01- 2012 తర్వాత, అండర్ -17 క్రీడలలో పాల్గొనే బాలబాలికలకు 01-01- 2009 తర్వాత జన్మించిన వారు క్రీడపోటీలకు అర్హులని తెలిపారు. కాబట్టి క్రీడలలో పాల్గొనే ఆసక్తిగల విద్యార్థులు వారు చదివే పాఠశాల నుండి వారి బోనిఫైడ్ సర్టిఫికెట్ ను తంగేడి పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పాఠశాల పని దినాలలో సమర్పించాలని తెలిపారు. ఎస్.జి.ఎఫ్ క్రీడలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ సెక్రెటరీ ఏ.లింగయ్య, వి. బిక్కు, వి.మట్టయ్య, జే. మహేష్, కవిత, శ్రీదేవి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## కాబోయే అమ్మకు భరోసా...!



**చౌటుప్పల్. ఆగస్టు 26. ప్రభాత సూర్య :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ వి హనుమంతరావు ఆదేశానుసారం అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్ రామ్ రెడ్డి పట్టణ పరిధిలో గల హ్యాండ్లూమ్ మార్కెట్ వద్ద మేక అనిత అనే 9 నెలల గర్భిణీ ఇంటికి వైద్య సిబ్బందితో కలిసివెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. సమయాను సారం మందులు వాడాలని ఆమెకు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందుతుందని భవిష్యత్తులో తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు కల్పించారని, అన్ని ప్రభుత్వ సదుపాయాలు మీకు అందుతాయని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ సత్యనారాయణ , ఎం ఎల్ హెచ్ పి ప్రణతి, ఏ ఎన్ ఎం లక్ష్మి,ఆశా వర్కర్లు అరుణ, శ్యామల, అంగన్వాడి టీచర్ ఐలమ్మ, టీఎంసీ కవిత పాల్గొన్నారు.

# ట్రినిటీ పాఠశాలలో వినాయక చవితి సంబరాలు





-వినాయకుడి ఆకృతిలో విద్యార్థులు... ఆకట్టుకున్న విన్యాసం...

**చౌటుప్పల్.ఆగస్టు 26. ప్రభాత సూర్య :** వినాయక చవితి వస్తుందంటే చాలు ఊరు వాడల్లో సందడి నెలకొంటుంది.. గణనాథుడు విగ్రహాలు పెట్టి చిన్నా పెద్ద సంబరాల్లో మునిగిపోతుంటారు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా వినాయక చవితి ముందే సందడి నెలకొంది. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో నిర్వహించిన ముందస్తు వినాయక చవితి వేడుకలు, సంబరాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం ట్రినిటీ పాఠశాలలో చైర్మన్ కేవీబీ కృష్ణారావు, డైరెక్టర్ కం ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు వినాయకుని ఆకారంలో కూర్చొని వినాయకుని ప్రతిరూపంను ప్రదర్శించారు. స్కూల్ విద్యార్థులు మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిష్టించి పూజలు ఘనంగా చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ... భారతీయుల అతి ముఖ్య పండుగలలో వినాయక చవితి ఒకటి అన్నారు. పార్వతీ, పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టిన రోజునే వినాయక చవితిగా జరుపుకుంటారని వినాయక పండుగ ప్రాముఖ్యత గురించి, వినాయక చవితి ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. వినాయకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన విగ్రహాలను వాడొద్దని, మట్టితో తయారుచేసిన వినాయకులని ప్రతిష్టించి పూజించాలని అన్నారు. వినాయక పండుగ ప్రకృతితో మమేకమైందని అన్నారు.పర్యావరణ సహితంగా వినాయక పండుగ జరుపుకోవాలని సూచించారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు,వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కే వి బి కృష్ణారావు, ఉపాధ్యాయులు అనూష, చందన, జ్యోతి, రత్న భార్గవి, సింధు, శిరీష, అనసూయ, లావణ్య, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హత కలిగినా పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

గ్రామంలో పేరకపోయినా సమస్యలను తక్షణం పరిష్కరించాలి

సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య డిమాండ్

**భువనగిరి, ఆగస్టు 26(ప్రభాత సూర్య):** అర్హత ఉండి ఇందిరమ్మ ఇండ్లు రాని పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. గ్రామంలో పేరుకుపోయిన ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణం ప్రభుత్వము స్పందించి వెంటనే పరిష్కారం చూపాలని అన్నారు. ఆదివారం భువనగిరి మండల పరిధిలోని చీమలకొండూరు గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి పంచాయతీ కార్యదర్శికి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అంజయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో ఇంక 30, 40 మందికి పైగా ఇల్లు లేని పేదలు ఉన్నారని వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా రాజకీయాలు చేస్తున్నారని ఇప్పటికైనా అర్హత ఉన్న పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని అన్నారు. గతం నాలుగైదు సంవత్సరాలుగా పెన్షన్ల కోసం దరఖాస్తు పెట్టుకొని ఎదురు చూస్తున్నారని ప్రభుత్వ హామీ ప్రకారం పెన్షన్ పెంచి నూతన పెన్షన్లు కూడా ఇవ్వాలని అన్నారు. గ్రామంలో వివిధ వార్డులలో ఇంకా మురికి కాలువలు, వీధి లైట్లు, సిసి రోడ్ల సమస్య ఉన్నదని అన్ని వార్డులలో రోడ్ల నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చీమల కొండూరు నుండి మస్తానపల్లికి, చొల్లేరుకు బీటీ రోడ్ల నిర్మాణం చేయాలని అన్నారు. ఇంకా ప్రభుత్వము భూమిలేని పేదలకు ఇస్తానన్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకము, గ్యాస్ సబ్సిడీ, మహిళా రుణాలు ఇచ్చి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి బోడ అంజనేయులు , సభ్యులు రాగుల పోషయ్య, కిష్టయ్య, గ్రామ ప్రజలు రచ్చ ఆంజనేయులు, గోపాల్, మోలుగు రాములు, కూనూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# అంతంపేట గ్రామంలో వినాయకునికే కరువైన గూడు

వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

**గట్టుపల్ ప్రభాతసూర్య 26** గట్టుప్పల మండలం అంతంపేట గ్రామంలో గత 32 ఏళ్లుగా కోటముందు వినాయక చవితి ఉత్సవాలను గ్రామస్థులు ఘనంగా నిర్వహిస్తుంటారు. ప్రతి సంవత్సరం గ్రామంలోని యువకులు కలిసి గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి, అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు చేస్తారు. అయితే ఈసారి వినాయక మండపానికి షెడ్ నిర్మాణం చెయ్యనీయ్యకుండా ఆపుతున్నారని . గత రెండు మూడు సంవత్సరాలుగా కోతులు, కుక్కల వల్ల పూజా సామగ్రి దెబ్బతినడం జరుగుతున్నందున రక్షణ కోసం షెడ్ నిర్మించాలని యువకులు నిర్ణయించగా, కొంతమంది కావాలనే అడ్డుకుంటున్నారని వినాయక కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. “32 ఏళ్ల క్రితమే స్టేజ్ నిర్మించాం, ఇప్పుడు అదే స్టేజ్‌పై షెడ్ వేస్తున్నాం. దీని వల్ల ఎవరికి ఎలాంటి నష్టం లేదు. అయినా ఎందుకు ఆపుతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. ఒక్కరోజే సమయం ఉంది కనుక వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని అందరూ సహకరించాలి” అని అంతంపేట వినాయక కమిటీ సభ్యులు కోరుతున్నరు. అదే విధంగా %-% మండప నిర్మాణం ఆపినవారే అక్కడ ఉన్న పూజా వస్తువులు, గణపతి విగ్రహం, లడ్డూ ప్రసాదం, అఖండ దీపాలు సురక్షితంగా ఉండేలా కాపలా వహించే బాధ్యత వహించాలంటూ వినాయక కమిటీ సభ్యులు మాదగోని నరేష్, వెంకటేష్, ఆంజనేయులు, లెంకలపల్లి నర్సింహ చారి, గుర్రప్ప శంకర్, మొగుదాల అనిల్, ప్రవీణ్, జనగాం మహేష్, రోకండ్ల జంగయ్య, మాదగోని మహేందర్, హనుమంతు, గునగంటి శ్రీను, గొడ్డెటి నాగేష్, మాదగోని దామోదర్, చింతకింది ప్రసాద్, ప్రణయ్ చారి, నడిళ్ళ యాదగిరి.డిమాండ్ చేశారు.



# ఎంఆర్ఓ ఆఫీస్ నుండి వినోభా నగర్ వరకు సీసీ రోడ్డు వేయాలని సిపిఎం డిమాండ్

**ఇబ్రహీంపట్నం.ప్రభాతసూర్య 26** ఇబ్రహీంపట్నం మున్సిపల్ పరిధిలో స్థానిక సమస్యలపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్ఓ ఆఫీస్ నుండి వినోభా నగర్ వరకు సీసీ రోడ్డు వేయాలని నేతలు డిమాండ్ చేశారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో రోడ్ వైడెనింగ్ పేరుతో 200 పిట్ల వెడల్పుతో కొలతలు వేసినప్పటికీ ప్రజలకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయని వారు గుర్తు చేశారు. ప్రజలకు నష్టపరిహారం అందజేసి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. 1వ వార్డులో చంద్రకళ టాకీస్ ఎదుట నిర్వహించిన నిరసనలో వాహన రాకపోకలకు ఇది ప్రమాదకర ప్రాంతమని, పైగా సమీపంలో పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేశ్, మున్సిపల్ కమిటీ సభ్యులు వై. స్వప్న, మల్లెల దశరథ్, మల్లెల నర్సింహ, డోంకి నర్సింహ, చింతపట్ల ప్రమోద్, ముత్యాల బాలరాజ్, ముదిగొండ ఎల్లప్ప, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



# ఇబ్రహీంపట్నం ఏ ఎల్ ఓ ఆఫీస్ ముందు ధర్నా

**ఇబ్రహీంపట్నం ప్రభాతసూర్య 26** ఇబ్రహీంపట్నంలో ఏ ఎల్ ఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది . భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి,ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా ఉపాధ్యక్షులు చింతపట్ల ఎల్లేశా మాట్లాడుతూ, తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం లో ఆన్లైన్ లోఅన్నీ అప్లికేషన్స్ గానీ, క్లైమ్స్, రెన్యూవల్స్ 2009 నుంచి కార్డులు కూడా రినివల్స్ చేయాలి. ఆధార్ లింక్స్ ఎఎల్ఓ త్వరగా చేయాలి. పేరు తప్పుగా పడిన వాటిని ఎఎల్ఓ సరి చేయాలి. చాలానాలో ఫోటోలు రావడం లేదు. ఆన్లైన్ పోర్టర్ రావడం లేదు అనీ ఏఎల్ఓ లకు ఇబ్బందిగా ఉంది దానిని వెంటనే సరి చేయాలి. దీని వలన క్లైమ్స్ నమోదుచేసుకున్న కార్మికులు, కొత్త కార్డులు తీసుకోవాలని అనుకున్న కార్మికులు, రెన్యూవల్స్ చేసుకోవాలని అనుకున్న కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆన్లైన్ కోసం కార్మికులు తమ కాలయాపనతో పాటు వారు రోజువారి కూలీ అర్థిక ఇబ్బందులు ఎదుర్కొటుంన్నారు. ? ఆన్లైన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూడగలరని ఇబ్రహీంపట్నం ప్రమీల మేడం గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి స్వప్న, భవన నిర్మాణ జిల్లా నాయకులు నరసింహ, సిఐటి నాయకులు యాదగిరి, వీరేషం, శేరిగూడ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షలు కార్య దర్శులు జంగయ్య, రాజు, భవన నిర్మాణ కార్మికులు సిహెచ్ నర్సింగ్, ఏ భాస్కర్, జి శ్రీనివాస్ సిహెచ్ జనార్ధన్,జి జంగయ్య తదితరులు పాల్గొన్నారు



## చందన పాఠశాలలో వినాయక చవితి వేడుకలు



**చౌటుప్పల్. ఆగస్టు 26. ప్రభాత సూర్య.** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని చందన పాఠశాలలో బుధవారం వినాయక చవితి సందర్భంగా పాఠశాలకు సెలవు దినం కావడంతో ముందస్తుగా మంగళవారం గణేష్ చతుర్థి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు రంగురంగుల, రకరకాల పర్యావరణ సహిత వినాయక ప్రతిమలను తయారు చేసుకొని వచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రిన్సిపల్ అవ్వరు రామేశ్వరి మాట్లాడుతూ... పండుగ వెనుక అంతరార్థాన్ని పండుగ యొక్క ప్రాశస్త్యాన్ని వివరించారు. సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి పండుగను కుల మతాలకు అతీతంగా నిర్వహిస్తామని, పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిదని,మన వంతుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసిన వినాయకులు వాడొద్దని, ఆవిగ్రహాలు నీటిలో కరగవు దానివల్ల చెరువులు, బావులలోని నీరు కలుషితమవుతాయి కాబట్టి మట్టి వినాయకులని పూజించాలని విద్యార్థుల చేత ఈ సందేశాన్ని పలువురికి తెలియజేయాలని కోరారు. పిల్లలు గణపతి మండపాలు ఏర్పాటు చేసి గణపతిని ప్రతిష్టించడం ద్వారా కార్యక్రమం నిర్వహించే శక్తి సామర్థ్యాలు తెలుసుకుంటారని, కార్యాచరణ మెలకువలు తెలుసుకుంటారని, వాడలో అందరూ కలిసిమెలిసి బాధ్యతను పంచుకోవడం పెంపొందుతుందని తెలియజేశారు. పర్యావరణ సహితంగా పండుగలను జరుపుకోవాలని ప్లాస్టిక్ నిషేధించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అందంగా వినాయకుని ప్రతిమలు తయారుచేసిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే స్వప్న,పద్మ, అర్చన, జీ సప్న, జగదీశ్వరి, కవిత,లావణ్య, దీప తేజ, ఉష,సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## చోట, వేలంగిణి గ్లోబల్ పాఠశాలలో వినాయక చవితి సంబరాలు



**చౌటుప్పల్.ఆగస్టు 26. ప్రభాత సూర్య :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని మై చోట స్కూల్, వేలంగిని గ్లోబల్ పాఠశాలలో వినాయక సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు మట్టితో తయారుచేసిన వినాయకుని ప్రతిమలను పాఠశాలలో ప్రదర్శించారు. వినాయకుని ప్రతిష్టించి పూజలు ఘనంగా చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతి మాట్లాడుతూ... విద్యార్థులకు వినాయక పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. వినాయకుని ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారుచేసిన విగ్రహాలను వాడొద్దని, మట్టితో తయారుచేసిన వినాయకులని ప్రతిష్టించి పూజించాలని అన్నారు. వినాయక పండుగ ప్రకృతితో మమేకమైందని అన్నారు.పర్యావరణ సహితంగా వినాయక పండుగ జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తురక కాశ సమస్యలను అసెంబ్లీ లో ప్రస్తావిస్తా...

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

- వినతి పత్రం అందజేసిన తురక కాశ నాయకులు




**భువనగిరి, ఆగష్టు 26( ప్రభాత సూర్య):** తురక కాశ రాష్ట్ర అధ్యక్షులు బడేసాబ్ భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా తురక కాశలు ఎదురుకుంటున్నాటువంటి సమస్యలను గురించి వివరించారు. తురక కాశలకు సరైన గుర్తింపు లేకపోవడం వల ఇండ్లు, ఉపాధి, విద్య సరిగ్గా లేకపోవడం వలన అతి పేదరికాన్ని గడుపుతున్నారని క్లుప్తంగా వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికై అసెంబ్లీలో తురుక కాశల గళం వినిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.... తురక కాశ సమస్యలను అసెంబ్లీ లో ప్రస్తావిస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు బడే సాబ్, భువనగిరి జిల్లా అధ్యక్షులు కరీం, జిల్లా నాయకులు మొహమ్మద్ మజ్హర్, షేక్ మౌలానా, మొహమ్మద్ యాకుబ్, సయ్యద్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

## సర్వీస్ రోడ్లను పూర్తిచేయాలని ఆర్డీఓ కు వినతి పత్రం అందజేత




**చౌటుప్పల్. ఆగస్టు 26. ప్రభాత సూర్య.** చౌటుప్పల్ హైవేను ఫ్లై ఓవర్ చేపట్టడానికి ప్రభుత్వం ఆరు నెలల క్రితం పనులు ప్రారంభించి అసంపూర్తిగా, నాణ్యత లోపంగా, సర్వీస్ రోడ్లను, డ్రైనేజీలను, నిర్మిస్తున్నారని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం చౌటుప్పల ఆర్డీఓ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ... ఫ్లై ఓవర్ రోడ్డు నిర్మాణం పేరుతో చౌటుప్పల మున్సిపాలిటీ రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్లను, డ్రైనేజీలను తొలగించి అలాగే వదిలిపెట్టి వెళ్లడం ద్వారా డ్రైనేజీ రోడ్డు వెంట వెళ్లడంతో దుర్గంధం, దుమ్ము, ధూళితో ప్రజలు, పాదాచారులు ఇబ్బందికి గురవుతున్నారన్నారు. సర్వీస్ రోడ్లు అసంపూర్తిగా ఉండడంతో వర్షాకాలం వల్ల నీటితో నిండి గుంతలుగా మారి అందులో వాహనదారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకుని ఫ్లైఓవర్ రోడ్డు గాని, సర్వీస్ రోడ్లను, డ్రైనేజీలను, త్వరగా వేసి చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజల ప్రాణాలను కాపాడవలసిందిగా కోరుతూ ఆర్డీఓ కి సిపిఎం పార్టీ మున్సిపల్ కమిటీ తరపున వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ చౌటుప్పల మున్సిపల్ కార్యదర్శి, గోశిక కరుణాకర్, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, నాయకులు బండారు నరసింహ, బత్తుల దాసు, బొడ్డు అంజిరెడ్డి, ఉష్కాగుల శ్రీనివాస్, తూర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, పిసాటి శంకర్ రెడ్డి, బోయ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఓజీతో లెక్కలు సరిచేయనున్న పవన్

ఒకప్పుడు వసూళ్ల పరంగా రికార్డులు నెలకొల్పుతూ.. ఇండస్ట్రీ హిట్లు కొడుతూ టాలీవుడ్ టాప్ స్టార్లలో ఒకడిగా ఉండేవాడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్. ఖుషి, గబ్బర్ సింగ్, అత్తారింటికి దారేది లాంటి చిత్రాలు సాధించిన వసూళ్లు చూసి ఆయా సందర్భాల్లో అందరూ ఆశ్చర్యపోయారు. బాహుబలి కంటే ముందు ఇండస్ట్రీ రికార్డ్ పవన్ పేరిటే ఉంది. ఐతే రాజకీయాల్లో బిజీ అయ్యాక పవన్‌కు సినిమాల మీద ఫోకస్ తగ్గిపోయింది. సరైన కాంబినేషన్లు కుదరలేదు. ఎక్కువగా రీమేక్‌లు చేశాడు. దీంతో ఆయన సినిమాల బిజినెస్, వసూళ్ల స్థాయి పడిపోయింది. అదే సమయంలో వేరే స్టార్లు ముందుకు దూసుకెళ్లిపోయారు. వంద కోట్ల షేర్ అన్నది చాలామందికి కేక్ వాక్ అయిపోయింది. కానీ పవన్ మాత్రం ఇంకా ఆ ఘనతను అందుకోలేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం. గత దశాబ్ద కాలంలో ఆయన చేసిన స్ట్రెయిట్ మూవీస్ అజ్ఞాతవాసి, హరిహర వీరమల్లు డిజాస్టర్లు కాగా.. రీమేక్ మూవీస్ ఒక స్థాయికి మించి ఆడలేకపోయాయి. దీంతో వంద కోట్ల షేర్ అన్నది పవన్‌కు ఇప్పటికీ కలగానే ఉంది. కానీ ఈ కలెక్షన్ల రికార్డులు ఎప్పుడూ ఆయన దృష్టిలో ఉండలేదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీని నడపడానికి మాత్రమే సినిమాలు చేస్తున్నానని ఆయన చెప్పిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఐతే పవన్ కొత్త సినిమా 'ఓజీ'కి ఉన్న అనూహ్యమైన హైప్ దృష్ట్యా వంద కోట్ల షేర్ అన్నది లాంఛనమే అనడంలో సందేహం లేదు. టాక్ ఎలా ఉన్నా ఈ సినిమా వంద కోట్ల షేర్ సాధించడానికి అడ్డంకులేమీ లేనట్లే. ఐతే పవన్ ఆ ఘనతను సాధిస్తే సరిపోదు. దానికి రెట్టింపు వసూళ్లు రాబడితేనే 'ఓజీ'ని సక్సెస్ ఫుల్ సినిమాగా నిలబెట్టగలడు. ఎందుకంటే ఈ సినిమాకు బిజినెస్ ఆ రేంజిలో జరిగింది. ఓజీ నైజాం హక్కులు మాత్రమే రూ.60 కోట్లు పలకడం విశేషం. ఆంధ్రా రైట్స్ రూ.75 కోట్లు, రాయలసీమయ హక్కులు రూ.25 కోట్ల దాకా పలికినట్లు సమాచారం. ఓవర్సీస్ రైట్స్ అన్నీ కలిపితే మొత్తం బిజినెస్ లెక్క రూ.200 కోట్లకు చేరుతోంది. అంటే ఆ మేరకు 'ఓజీ' షేర్ రాబట్టాల్సి ఉంది.



# రవితేజ ఫ్యాన్స్‌కి బ్యాడ్ న్యూస్.. 'మాస్ జాతర' వాయిదా!

రవితేజ తాజా చిత్రం 'మాస్ జాతర' విడుదల వాయిదా పడుతున్నట్లు గత కొన్నాళ్లుగా సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లే నిజమయ్యాయి. ఈ సినిమా రిలీజ్‌ను వాయిదా వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. వాస్తవానికి ఈ చిత్రం ఆగస్ట్ 27న విడుదల కావాల్సింది. కానీ ఇటీవల పరిశ్రమ వ్యాప్తంగా జరిగిన సమ్మెలు మరియు కీలకమైన కంటెంట్ పూర్తి చేయడంలో ఊహించని జాప్యం కారణంగా.. సినిమాను అనుకున్న తేదీకి సకాలంలో సిద్ధం చేయలేకపోయామని నిర్మాతలు అధికారికంగా తెలిపారు. కంగారుగా సినిమాని విడుదల చేయడం కంటే.. కాస్త సమయం తీసుకొని అత్యుత్తమ చిత్రంగా మలిచి, ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని అందించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు. మాస్ జతార చిత్రాన్ని అసలైన పండుగ సినిమాగా తీర్చిదిద్దడానికి ప్రతి విభాగం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని నిర్మాతలు తెలిపారు. కొత్త విడుదల తేదీ ఇంకా ఖరారు కానప్పటికీ, త్వరలోనే ప్రకటన వస్తుందని పేర్కొన్నారు. అభిమానులు నిరీక్షణకు బహుమానంగా త్వరలో ఆశ్చర్యకర కంటెంట్ రాబోతుందని నిర్మాతలు హామీ ఇచ్చారు మాస్ జాతర విషయానికొస్తే.. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల మళ్లీ జంటగా కలిసి నటిస్తున్న సినిమా ఇది. రవితేజ కెరీర్‌లోని ఈ 75వ సినిమాకు భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.



## శ్రీలీల హిందీ డెబ్యూ ఎవరితో

తెలుగులో టాప్ మోస్ట్ డిమాండ్ ఎంజాయ్ చేస్తున్న శ్రీలీల త్వరలో పరాశక్తితో తమిళంలో అడుగు పెట్టనుంది. కన్నడలో జూనియర్ ద్వారా ఆ లాంఛనం అయిపోవడంతో నెక్స్ట్ టార్గెట్ హిందీ కానుంది. తను అక్కడ రెండు సినిమాలు చేసింది. వాటిలో మొదటిది ఇబ్రహీం అలీ ఖాన్ సరసన చేసిన దైలర్. అయితే షూటింగ్ ఏ దశలో ఉందనేది ఇప్పటిదాకా ఎలాంటి అప్డేట్ లేదు. స్త్రీ లాంటి బ్లాక్ బస్టర్స్ నిర్మించిన మాడాక్ ఫిలిమ్స్ దీనికి నిర్మాత. ట్విస్ట్ ఏంటంటే దైలర్ ని నేరుగా ఓటిటి రిలీజ్ చేయాలనే ఆలోచనలో నిర్మాణ సంస్థ ఉందని ముంబై టాక్. అధికారిక ప్రకటన రాలేదు కానీ టాక్స్ బలంగా ఉన్నాయి. దైలర్ కన్నా ఎక్కువగా శ్రీలీల ఆశలు కార్తీక్ ఆర్యన్ తో చేస్తున్న సినిమా మీదున్నాయి. ఆషీకీ 3గా ప్రచారంలో ఉన్న ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో మంచి పాటలు, సైయారా స్థాయిలో రొమాన్స్, యూత్ ని ఆకట్టుకునే అంశాలు చాలా ఉన్నాయని వినికిడి. ఇది థియేటర్ రిలీజ్ అవుతుంది. దీంతో తనకు పెద్ద బ్రేక్ దక్కుతుందనే నమ్మకం శ్రీలీలలో ఉంది. కార్తీక్ ఆర్యన్ తో తన స్నేహం గురించి ముంబై మీడియాలో ఏవేవో ప్రచారాలు జరిగినా వాటిని పట్టించుకోకుండా ముందుకు వెళ్తోంది.




## హనుమాన్ హీరో కొత్త మూవీ.. రిలీజ్ డేట్ ఇదే

బాలనటుడిగా కెరీర్ మొదలుపెట్టి.. హీరోగా 'హనుమాన్'తో పాన్ ఇండియా గుర్తింపు తెచ్చుకున్న తేజా సజ్జా.. ఇప్పుడు 'మిరాయ్'తో రాబోతున్నాడు. ఇది సూపర్ హీరో తరహా సినిమానే. చాన్నాళ్లుగా వాయిదాలు పడుతూ వచ్చింది. ఫైనల్‌గా సెప్టెంబరు తొలివారం రిలీజ్ పెట్టుకున్నారు. ఇప్పుడు మరోసారి వాయిదా పడిందని చెబుతూ కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు. తేజా సజ్జా హీరోగా నటిస్తుండగా.. మంచు మనోజ్ విలన్‌గా చేస్తున్నాడు. రితికా నాయక్ హీరోయిన్. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్స్ మీడియా సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మించింది. ఈ చిత్రాన్ని తొలుత సెప్టెంబరు 5న రిలీజ్ చేయాలనుకున్నారు. మరి ఏమైందో ఏమో గానీ వారం ఆలస్యంగా అంటే సెప్టెంబరు 12న థియేటర్లలో తీసుకురానున్నట్లు ఇప్పుడు కొత్త పోస్టర్ వదిలారు. అలానే ఈనెల 28న ట్రైలర్ రిలీజ్ చేస్తామని ప్రకటించారు. ఈ సినిమా విడుదలకు ముందే పీపుల్స్ మీడియా సంస్థలో తేజా సజ్జా మరో చిత్రానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. రీసెంట్‌గానే ఆ ప్రకటన కూడా వచ్చింది. అయితే అది 'జాంబీరెడ్డి' సీక్వెల్ అని సోషల్ మీడియాలో టాక్ నడుస్తోంది.

## కమర్షియల్ సినిమాల్లో వెయ్యి తప్పులున్నా పట్టించుకోరు

అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'పరదా'. ఈ సినిమాకు ప్రవీణ్ కాంద్రేగులా దర్శకత్వం వహించగా ఆగష్టు 22న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. అయితే ఈ సినిమాపై విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ విమర్శలపై తాజాగా స్పందించింది అనుపమ. 'పరదా' సినిమా విజయోత్సవ సభలో ఆమె మాట్లాడుతూ.. కమర్షియల్ సినిమాల్లో ఎన్ని తప్పులు ఉన్నా విమర్శకులతో పాటు ప్రేక్షకులు పెద్దగా పట్టించుకోరని, కానీ ప్రయోగాత్మక, నాయికా ప్రాధాన్యం ఉన్న చిత్రాలను తెరకెక్కిస్తే అందులో వెయ్యి తప్పులు వెతుకుతారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా పరంగానే కాకుండా వ్యక్తిగత జీవితంలో కూడా ఇలాంటి ధోరణులు కనిపిస్తుంటాయని తెలిపారు. కొత్తగా ఏదైనా ప్రయత్నిస్తే దానిని సగం మంది విమర్శిస్తుంటారని, అయితే తాము పడిన కష్టాన్ని గుర్తించి, ఇలాంటి కొత్త కథలను ప్రోత్సహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు ప్రవీణ్ కంద్రేగుల కూడా మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు మంచి కథలను ఆదరిస్తారనే నమ్మకంతోనే ఈ సినిమా తీశామని, కానీ కొందరు మంచి కంటెంట్‌ను విస్మరించి తప్పులు వెతకడంపైనే దృష్టి సారిస్తున్నారని అన్నారు. ముఖం కనిపించని పాత్రలో నటించేందుకు ఒప్పుకున్న అనుపమ ధైర్యం గొప్పదని, ఈ సినిమాతో ఆమెకు జాతీయ అవార్డు రావాలని ఆకాంక్షించారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.